FLASH INDIA NEWS
www.flashindianews.com
# ఫ్లాష్ ఇండియా
తెలుగు దినపత్రిక
FLASH INDIA TELUGU DAILY
RNI NO. APTEL/2010/33229

విలేకరులు కావలెను
రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్న 'ఫ్లాష్ఇండియా' తెలుగు దినపత్రికకు రాష్ట్రంలో అన్ని ప్రాంతాల నుండి విలేకరులు కావలెను
ఫోన్ : 7730032999

సంపుటి : 16 | సంచిక : 90 | గురువారం 08-05-2025 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల : రూ 2/-

## ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడు

- ఆపరేషన్ సింధూర్ పై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రివ్యూ
- భారత సైన్యానికి సంఘీభావంగా నేడు సాయంత్రం 6 గంటలకు ర్యాలీ
- సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు ర్యాలీ.. హాజరుకానున్న సీఎం రేవంత్, మంత్రులు, ఇతర నేతలు

03

అందరు సిద్ధంగా ఉండండి

విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలి



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** పహెల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో రాజకీయాలకు తావు లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఉదయం కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ఆర్మీ, పోలీస్, డిజాస్టర్ మేనేజ్ మెంట్, ఇతర సంబంధిత వివిధ విభాగాల ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. అత్యవసర సర్వీస్ లు అందించే విభాగాల ఉద్యోగుల సెలవులు రద్దు చేస్తూ ఈ సమావేశంలో సీఎం నిర్ణయం తీసుకున్నారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి అనధి కారికంగా నివసిస్తున్న వారిని తక్షణమే అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు.

## జేషే మహ్మద్ చీఫ్ మసూద్‌కు భారీ షాక్


- భారత్ దాడిలో జైషే మమహ్మద్‌కు కోలుకోలేని దెబ్బ..
- మసూద్ అజహర్ బంధువర్గంలో 10 మంది హతం..
- బహవల్‌పూర్‌లోనే జైషే స్థావరాన్ని ముట్టుబెట్టిన భారత ఆర్మీ..



02

### ఎమర్జెన్సీ ప్రకటించిన పాకిస్తాన్

ఆపరేషన్ సిందూర్ పేరిట భారత్ పాక్ ఉగ్రస్థావరాలపై నిర్వహించిన మెరుపు దాడుల్లో పదుల సంఖ్యలో మరణించారు. అయితే, ఈ దాడుల్లో జైషే మహ్మద్ చీఫ్ అజర్ మసూద్ కుటుంబసభ్యులు కూడా మరణించినట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది. బహావల్ పూర్ లో జరిగిన దాడిలో మజూర్ సోదరితో పాటు ఐక్యరాజ్య సమితి ఉగ్రవాది ప్రకటించి మరో బంధువుతో సహా మొత్తం 10 మంది కుటుంబసభ్యులు బాంబు ధాటికి ...



# జస్ట్ 24 నిమిషాల్లో

## 9 ఉగ్ర శిబిరాలపై ఏక కాలంలో 24 క్షిపణులు



- భారతీయ పౌరుల ఊపిరి తీసి.. హాయిగా సేద తీరుతున్న ఉగ్ర మూకలను ఊచకోత కోసింది ఇండియన్ ఆర్మీ
- సరిగ్గా తెల్లవారుజాము సమయంలో.. ఊహించని రీతిలో అటాక్ చేసి ఆ నర రూప రాక్షసుల అంతు చూసింది
- పీవోకే, పాక్ లోని ఉగ్రవాదుల స్థావరాలే లక్ష్యంగా దాడులు చేశాం
- ముర్కిదే క్యాంపుపై దాడి చేశాం
- ఇక్కడ నుంచే ముంబై పేలుళ్ల దాడి జరిగింది
- కసబ్ ఇక్కడే ట్రైనింగ్ తీసుకున్నాడు..




### ఆపరేషన్ సిందూర్ జరిగింది ఇలా..

'ఆపరేషన్ సిందూర్ ' జరిపిన తీరును కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ వివరించారు. ''పహల్గాం మృతులకు న్యాయం చేసేందుకే ఆపరేషన్ సిందూర్ చేపట్టాం. గత 30 ఏళ్లుగా పాక్ ఉగ్రమూకలకు సౌకర్యాలు కల్పిస్తోంది. ఆ దేశంతో పాటు పీఓకేలోనూ ఉగ్ర శిబిరాలు ఉన్నాయి. నిఘా వర్గాల సాయంతో మొత్తం 21 స్థావరాలను గుర్తించాం. అందులో తొమ్మిదింటిని లక్ష్యంగా చేసుకున్నాం. కేవలం ఉగ్ర శిబిరాలపైనే దాడులు చేశాం. పాక్ పౌరులకు హాని జరగకుండా వాటిని నిర్వహించాం. సైనిక శిబిరాలను లక్ష్యంగా చేసుకోలేదు. అర్ధరాత్రి 1.05-1.30 గంటల మధ్య ఈ ఆపరేషన్ జరిగింది. భారత్ టార్గెట్ చేసిన వాటిల్లో.. లాహోర్ కు 40 కిలోమీటర్ల దూరంలోని మురిద్కేలో గల లష్కరే తోయిబా ఉగ్ర శిబిరం కూడా ఉంది. ఇక్కడ 26/11 ముంబయి దాడులకు పాల్పలడిన ఉగ్రవాదులు అజ్మల్ కసబ్ , డేవిడ్ హెడ్లీ శిక్షణ తీసుకున్నారు'' అని కర్నల్ సోఫియా ఖురేషి వెల్లడించారు. చరిత్రలో తొలిసారి మిలిటరీ ఆపరేషన్ సంగతులను మహిళా అధికారులు వెల్లడించడం విశేషం.




**ఢిల్లీ:** భారతీయ పౌరుల ఊపిరి తీసి.. హాయిగా సేద తీరుతున్న ఉగ్ర మూకలను ఊచకోత కోసింది ఇండియన్ ఆర్మీ. సరిగ్గా తెల్లవారుజాము సమయంలో.. ఊహించని రీతిలో అటాక్ చేసి ఆ నర రూప రాక్షసుల అంతు చూసింది. 9 ఉగ్ర శిబిరాలపై ఏక కాలంలో 24 క్షిపణులు దాడి చేసి సమస్తం నేలమట్టం చేశాయి. ఇంత విధ్వంసం కేవలం 24 నిమిషాల్లోనే పూర్తవడం విశేషం. పెళ్లై పది రోజులైనా కాకుండా.. సింధూరానికి దూరమైన ఆడబిడ్డ కన్నీటి సాక్షిగా 'ఆపరేషన్ సిందూర్'

**ఇండియన్ ఆర్మీ దెబ్బకు ఉగ్రవాదులు కకావికలం..**

24 క్షిపణలు ఏక కాలంలో ఎటాక్ చేయడంతో ఉగ్రవాదులు కకా వికలం అయ్యారు. పేలుడు సంభవించిన సమీపంలోని ఉగ్ర వాదులు భయంతో అటూ ఇటూ పరుగులు తీయడం ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.న్యూఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో.. విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి, కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ తో కలిసి మాట్లాడుతూ ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడికి ప్రతిస్పందనగా ఈ ఆపరేషన్ జరిగిందని అన్నారు. పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థలు జరిపిన దాడిలో ఒక నేపాలీ జాతీయుడు సహా 26 మంది ప్రాణాలు కోల్పోగా, అనేక మంది గాయపడ్డారు. దీనికి ప్రతిచర్యగానే.. ఈ అటాక్ అని స్పష్టం చేశారు.ఈ ఆపరేషన్ వ్యూహంలో మార్పును సూచిస్తుందని కల్నల్ ఖురేషి అన్నారు.

**దాడులు జరిగిన ఉగ్రస్థావరాలివే..**

ముజఫరాబాద్, కోట్లి, బహావల్పూర్, రావలకోట్, చక్స్వారీ, భీంబర్, నీలం వ్యాలీ, జీలం, చక్వాల్ లోని ఉగ్రవాద స్థావరాలపై ఇండియన్ ఆర్మీ దాడులు చేసింది. ఇవన్నీ ఉగ్రవాద శిబిరాలకు స్థావరాలుగా నిఘా సంస్థలు చాలా కాలంగా అనుమానిస్తున్నాయి. ఈ ప్రదేశాలు లష్కరే తోయిబా (LeT), జైషే మొహమ్మద్ (JeM) లతో అనుబంధంగా ఉన్నాయని బలమైన ఆధారాలు కూడా ఉన్నాయి. ఈ రెండు ఉగ్రవాద సంస్థలు భారత దేశంలో అనేక సంవత్సరాలుగా దాడులకు పాల్పడ్డాయి. ఇక దాడికి గురైన తొమ్మిది ప్రదేశాలలో ఐదు పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ లో ఉన్నాయి. నాలుగు పాకిస్తాన్ ప్రధాన భూభాగంలో ఉన్నాయి. **మిగితా 02 పేజీలో...**

## అందుకే.. ఆపరేషన్ సింధూర్

02

- గతంలో పార్లమెంట్‌పై దాడి నుంచి తాజాగా జరిగిన పహల్గామ్ దాడి వరకూ మొత్తం 350 మంది పౌరులు మృతి



## కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్

- బీజాపూర్- బీజాపూర్ లోని కర్రెగుట్ట కొండలో రెండు వారాలుగా ఆపరేషన్
- బీజాపూర్ జిల్లా ఊసూర్ బ్లాక్ కర్రె గుట్టలపై ఎన్ కౌంటర్
- భద్రతా బలగాల ఎదురు కాల్పుల్లో 22 మంది మావోయిస్టులు మృతి

05



## హైదరాబాద్‌కు చేరుకున్న 51 దేశాల అందగత్తెలు


- ప్రతిష్టాత్మకమైన మిస్ వరల్డ్ పోటీలకు హోస్టింగ్ చేస్తున్న తెలంగాణ
- ఇప్పటికే నగరానికి చేరుకున్న 51 దేశాలకు చెందిన అందగత్తెలు ఈ వేడుకల్లో పాల్గొనేందుకు
- ఎయిర్ పోర్టుకు చేరుకుంటున్న వివిధ దేశాల కంటెస్టెంట్లు



06


**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ప్రతిష్టాత్మకమైన మిస్ వరల్డ్ పోటీలకు హోస్టింగ్ చేసే అరుదైన గౌరవాన్ని పొందిన హైదరాబాద్ ఇప్పుడు అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తోంది. ఇప్పటికే 51 దేశాలకు చెందిన అందాల ప్రదినిధులు నగరానికి చేరుకున్నారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల కంటెస్టెంట్లు ఎయిర్ పోర్టులో అడుగుపెడుతున్న నేపథ్యంలో శంషాబాద్ విమానాశ్రయం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. వచ్చిన ప్రతి కంటెస్టెంట్ కు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ఆధారంగా సాంప్రదాయ వస్త్రధారణతో, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలుకుతోంది.

### హైదరాబాద్



| | |
|---|---|
| 22 క్యారెట్ | రూ.90,750 |
| 24 క్యారెట్ | రూ.99,000 |
| కేజీ వెండి | రూ.1,11,000 |

### చికెన్ రేటు



| | |
|---|---|
| Dressed With Skin | 180 Kg |
| Skinless | 210 Kg |
| Boneless | 220 Kg |

## సైరన్ మోగిన వెంటనే ఏం చెయ్యాలంటే?



- హైదరాబాద్ నగరంలోని ఓఆర్ఆర్ పరిధిలో మాక్ డ్రిల్
- ప్రజలకు సూచనలను తెలిపిన సీపీ ఆనంద్.

06

## "ఆపరేషన్ సింధూర్" విజయోత్సవ సంబరాల్లో

- సైనికులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి పొన్నం.
- "ఆపరేషన్ సింధూర్" విజయోత్సవ సంబరాల్లో పాల్గొన్న మంత్రి
- హుస్నాబాద్ నియోజకవర్గం కొహెడలో సంబరాల్లో పాల్గొన్న మంత్రి.

03



**హుస్నాబాద్ ఫ్లాష్ ఇండియా :** నేడు ఉదయం పాకిస్తాన్ పై భారత్ చేసిన 'ఆపరేషన్ సింధూరం' విజయం కావడంతో దేశమంతటా విజయోత్సవ సంబరాలు కొనసాగుతున్నాయి. ఇక ఈ "ఆపరేషన్ సింధూర్" విజయవంతంపై హుస్నాబాద్ నియోజకవర్గం కొహెడలో మంత్రి పొన్నం ప్రభాకర్ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన హర్షం వ్యక్తం చేసారు. భారత్ మాత కి జై అంటూ నినాదాలు చేస్తూ సంబరాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానిస్తూ.. జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ టూరిస్టుల పై ఉగ్రవాదుల దాడికి

## సిడబ్ల్యూసి ఛైర్మన్‌తో మంత్రి భేటీ

- కేంద్ర జల సంఘం" (సిడబ్ల్యుసి) ఛైర్మన్ అతుల్ జై తో సమావేశమైన తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి.
- సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు.
- మేడిగడ్డ డ్యామ్ కూలిపోవడం పై జాతీయ డామ్ సంరక్షణ సంస్థ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై చర్చ.
- సమ్మక్క, సారక్క, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు. కృష్ణానది పై పలు చోట్ల టెలిమెట్రి పరికరాలు ఏర్పాటు.

03



**ఢిల్లీ :** తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర జల సంఘం (CWC) ఛైర్మన్ అతుల్ జైతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మేడిగడ్డ, సమ్మక్క సారక్క, పాలమూరు-రంగారెడ్డి వంటి ప్రధాన ప్రాజెక్టులపై చర్చ జరిగింది. రాష్ట్ర నీటిపా రుదల శాఖకు చెందిన ఉన్నతాధికారులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు.ఇక మేడిగడ్డ డ్యామ్ కూలిపోవడంపై "జాతీయ డ్యామ్ సంరక్షణ సంస్థ"

# ఎమర్జెన్సీ ప్రకటించిన పాకిస్తాన్

- ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్‌లోని 9 ఉగ్రస్థావరాలపై మెరుపు దాడులు
- ఈ క్రమంలో పాకిస్తాన్ ఎమర్జెనీ ప్రకిటించింది ఎమర్జెన్సీలో ఏమేమి చేయాలో కార్యక్రమాలను చేపడుతోంది
- కొద్ది సేపటి క్రితమే ఎమర్జెన్సీని ప్రకటించిన పాక్ సరిహద్దుల్లో భారత్ బలగాలపై పాక్ దాడులు



**న్యూఢిల్లీ:** ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్థాన్ లోని ఉగ్ర స్థావరాలపై భారత్ ఆర్మీ ఎయిర్ ఫోర్స్ , నేవీ సంయుక్తంగా మెరుపు దాడులు చేసింది. పాక్ ఆక్రమిత కశ్మీర్ తో పాటూ పాకిస్థాన్ లోని ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేశాయి. బహావల్ పూర్, కోట్లీ, ముజఫరాబాద్ పై క్షిపణి దాడులు జరిగాయి. ఈ దాడుల్లో సుమారు 90 మంది ఉగ్రవాదులు మృతి చెందినట్లు సమాచారం. మరికొంతమంది తీవ్రంగా గాయపడినట్లు తెలియవచ్చింది. ఈ నేపథ్యంలో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో పాకిస్తాన్ ఎమర్జెనీ ప్రకిటించింది. ఎమర్జెన్సీలో ఏమేమి చేయాలో కార్యక్రమాలను చేపడుతోంది. కొద్ది సేపటి క్రితమే ఎమర్జెన్సీని ప్రకటించింది.

**సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం..**

అలాగే సరిహద్దు ప్రాంతాల్లో భారత్ సైనికులపై పాక్ సేనలు తిరగబడుతున్నాయి. ఈ ఘటనలో ఇరువైపులా ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం. రాత్రి జరిగిన ఆపరేషన్ సింధూర్ కు ప్రతికారంగా పాకిస్తాన్ ఇప్పుడు స్పందిస్తోంది. సరిహద్దులో ఉద్రిక్తత నెలకొంది. కాగా భారత్ సేనలు పాకిస్తాన్ లోని 9 ఉగ్రవాద శిబిరాల్లో దాడులు చేసి వాటిని ధ్వంసం చేశారు. అయితే పహల్గాం దాడి తర్వాత ఉగ్రవాదులను పాక్ ప్రభుత్వం వేరే శిబిరాలకు తరలించింది. మదర్సాలలో పెట్టారు. దీంతో పాకిస్తాన్ ప్రభుత్వం తమ మదర్సాలు, మసీదులు, ప్రార్థనా మందిలపై భారత్ దాడి చేసిందని పాకిస్తాన్ ప్రజలను రెచ్చగొడుతూ.. అక్కడ జరిగిన నష్టాన్ని ప్రపంచం ముందుకు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది.

**మెడికల్ ఎమర్జెన్సీ...**

ఆపరేషన్ సింధూర్ పేరుతో ఉగ్రస్థావరాలపై ఇండియన్ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ కలిసి మెరుపు దాడులు చేశాయి. ఈ దాడుల్లో సుమారు 90 మందికిపైగా ఉగ్రవాదులు హతమైనట్లు సమాచారం. భారత్ దాడితో పాకిస్థాన్ లో అలజడి రేగింది. లాహోర్, సియాల్ కోట్ ఎయిర్ పోర్టులను మూసివేసింది. ఇస్లామాబాద్, రావల్పిండిలో మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించింది. పాక్ అధికారులు వైద్య సిబ్బందికి సెలవులు రద్దు చేసి.. వెంటనే విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ చేశారు.

**హై అలర్ట్..**

పాకిస్థాన్ లోని ప్రధాన ఎయిర్ పోర్టుల్లోనూ ఎమర్జెన్సీ ప్రకటించారు. ఇస్లామాబాద్, కరాచీ, లాహోర్, ముల్తాన్, స్కార్డు, ఫైసలాబాద్, పెషావర్ ఎయిర్ పోర్టుల్లో పాక్ ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించింది. ఇస్లామాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టును మూసివేయడంతో అక్కడకు చేరాల్సిన ఫ్లైట్స్ ను కరాచీకి మళ్లిస్తున్నారు. పాక్ గగనతలాన్ని పూర్తిగా మూసివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# సిబ్బందిని వెనక్కి రప్పించండి



- పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకుంటున్న భారత్..
- ఆపరేషన్ సింధూర్ పేరిట పాక్ పై దాడులు చేసిన ఇండియన్ ఆర్మీ..
- సెలవులో ఉన్న సిబ్బందిని వెనక్కి రప్పించాలని పారా మిలిటరీకి అమిత్ షా ఆదేశాలు..

**ఢిల్లీ:** పహల్గాం ఉగ్ర దాడికి భారత బలగాలు ప్రతీకారం తీర్చుకుంటున్నాయి. 'ఆపరేషన్ సింధూర్ ' పేరిట తొమ్మిది ఉగ్ర స్థావరాలపై బుధవారం నాడు తెల్లవారు జామున విరుచుకు పడ్డాయి. ఈ దాడి తర్వాత కూడా పాకిస్తాన్ రేంజర్లు విచక్షణ రహితంగా కాల్పులు జరపడంతో.. ఈ ఘటనలో సుమారు పది మంది భారతీయ పౌరులు మృతి చెందినట్లు తెలుస్తుంది. అలాగే, పలువురు గాయపడినట్లు భారత ఆర్మీ అధికారులు చెప్పుకొచ్చారు. ఈ తరుణంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. సెలవులో ఉన్న సిబ్బందిని వెనక్కి రప్పించాలని పారా మిలిటరీ బలగాలకు కేంద్రమంత్రి అమిత్ షా ఆదేశాలు జారీ చేశారు.అయితే, గత నెలలో విహార యాత్రకు వెళ్లిన టూరిస్టులపై పహల్గాంలో ఉగ్రవాదులు దాడి చేసి 26 మంది ప్రాణాలు తీశారు. అప్పటి నుంచి పాకిస్తాన్ పై అన్ని వైపులా భారత్ ఒత్తిడి తీసుకురావడం స్టార్ట్ చేసింది. ఇప్పుడు పాకిస్తాన్, పీఓకేలోని ఉగ్ర స్థావరాలపై ఇండియన్ ఆర్మీ దాడి చేయడంతో ప్రపంచ వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారిపోయింది. ఉగ్రవాదులకు సరైన గుణపాఠం చెప్పారంటూ కేంద్ర ప్రభుత్వాన్ని, భద్రతా బలగాలను పలు దేశాలకు చెందిన ప్రతినిధులతో పాటు దేశ ప్రజలు కోరుతున్నారు.

# జస్ట్ 24 నిమిషాల్లో ఖతం..

మొదటిపేజీ తరువాయి

పేరుతో ఉగ్రమూకల అంతు చూసింది ఇండియన్ ఆర్మీ. మే 7వ తేదీన తెల్లవారుజామున 1:05 నుంచి 1:30 గంటల వరకు భారత సైన్యం, నావికాదళం, వైమానిక దళం సంయుక్తంగా ఆపరేషన్ సిందూర్ నిర్వహించాయి. కేవలం 24 నిమిషాల్లోనే ఉగ్రమూకల స్థావరాలను నేలమట్టం చేశాయి.

**ఇండియన్ ఆర్మీ దెబ్బకు ఉగ్రవాదులు కకావికలం..**

'గత మూడు దశాబ్దాలుగా, పాకిస్తాన్ పీవోజేకే, పాకిస్తాన్ అంతటా రిక్రూట్ మెంట్ కేంద్రాలు, శిక్షణా ప్రాంతాలు, లాంచ్ ప్యాడ్ లు వంటి ఉగ్రవాద మౌలిక సదుపాయాలను నిర్మిస్తోంది. ఈ ఆపరేషన్ ఆ సౌకర్యాలను కూల్చివేసి భవిష్యత్తులో దాడులను నిరోధించడానికి ఉద్దేశించింది' అని ఆమె చెప్పారు. 'భారతదేశంపై మరిన్ని దాడులు జరగబోతున్నాయని మా నిఘా వర్గాలు సూచించాయి. అందుకే.. ఈ ఉదయం ఉగ్రవాద నిర్మూలనా ఆపరేషన్ చేపట్టాం. మా హక్కును మేము ఉపయోగించుకున్నాం. మా చర్యలు తీవ్రతరం కానివి. బాధ్యతాయుంగా ఉన్నాయి. ఉగ్రవాదుల మౌలిక సదుపాయాలను కూల్చివేయడంపైనే దృష్టిసారించడం జరిగింది.' అని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ అన్నారు.

**దాడులు జరిగిన ఉగ్రస్థావరాలివే..**

ముఖ్యంగా బహవల్పూర్ జెఎంకు బలమైన కోటగా ప్రసిద్ధి చెందింది. ముజఫరాబాద్, భీంబర్ లను గతంలో భారత భద్రతా సంస్థలు కాశ్మీర్ లోకి చొరబడటానికి రవాణా, లాజిస్టిక్స్ పాయింట్లుగా గుర్తించాయి. ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం.. ఆపరేషన్ సిందూర్ సూపర్ సక్సెస్ అయ్యింది. లక్షిత స్థావరాలన్నీ ధ్వంసమయ్యాయి. శిక్షణా శిబిరాలు, ఆయుధ గోదాములు, స్టేజింగ్ సౌకర్యాల ధ్వంసమైనట్లు భారత ప్రభుత్వం ప్రకటించింది. ఆపరేషన్ సిందూర్ విస్తృతంగా జరిగినప్పటికీ.. పాకిస్తాన్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకోలేదు.

**భారీ నష్టం..**

భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ లో 70 మందికి పైగా ఉగ్రవాదులు మరణించగా.. 60 మందికి పైగా గాయపడ్డినట్లు సమాచారం. భూమి నుండి, ఆకాశం నుండి ప్రయోగించే క్షిపణులను ఉపయోగించి భారత్ ఈ దాడులు చేసింది. నిఘా డ్రోన్ ల ద్వారా రియల్ టైమ్ పర్యవేక్షణ.. తక్కువ పౌరుల ప్రాణనష్టంతో లక్ష్య చేధనను నిర్ధారించబడటానికి వీలు కల్పించిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

# జేషే మహ్మద్ చీఫ్ మసూద్‌కు భారీ షాక్

**ఢిల్లీ:** జైషే మహ్మద్, లష్కరే తయ్యిబా ప్రధాన కార్యాలయాలున్న ప్రాంతాల్లోనే ఈ దాడులు జరిగాయి. ఉగ్రవాదుల స్థావరాలనే తాము టార్గెట్ చేసుకున్నామని భారత్ స్పష్టం చేసింది. సామాన్యులకు అపాయం కలుగకుండా ఆపరేషన్ నిర్వహించినట్టు వెల్లడించింది.ఈ దాడిలోో పాక్ ఉగ్రస్థావరాలపై భారత్ 25 నిమిషాల పాటు బాంబుల వర్షం కురిపించినట్టు తెలుస్తోంది. అత్యంత కచ్చితత్వంతో జరిపిన ఈ దాడుల్లో సుమారు 70 మంది ఉగ్రవాదులు అంతమయ్యారు. పీఓకే ఉగ్రస్థావరాలతో పాటు పాక్ లోని ఐదు ఉగ్రక్యాంపులను కూడా భారత్ ధ్వంసం చేసింది.కాగా, భారత్ చర్యలపై స్పందించిన పాక్.. ఈ ఆపరేషన్ ను యుద్ధ చర్యగా అభివర్ణించింది. అయితే, భారత్ తన చర్యలను కట్టిపెడితే తాము ప్రతి దాడికి దిగబోమని కాళ్లబేరానికి వచ్చింది. ఇదిలా ఉంటే భారత్ కూడా పాక్ కు గట్టి హెచ్చరికలు జారీ చేసింది. పరిస్థితి మరింత దిగజార్చేలా దాడులకు దిగితే గట్టి బదులిస్తామనని వార్నింగ్ ఇచ్చింది. ఈ సందర్భంగా ప్రపంచ దేశాలు భారత్ కు అండగా నిలిచాయి. స్వీయ రక్షణ భారత దేశ హక్కు అని ముక్తకంఠంతో పేర్కొన్నాయి.ఆపరేషన్ సిందూర్ సందర్భంగా తాము ఎలాంటి మిలిటరీ స్థావరాలను టార్గెట్ చేయలేదని పత్రికా సమావేశంలో భారత ఎయిర్ ఫోర్స్ వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ పేర్కొన్నారు. అయితే, పాక్ చేపట్టే ఎలాంటి దుందుడుకు చర్యలకైనా తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కచ్చితమైన నిఘా సమాచారంతో తాము ఈ లక్ష్యాలను ఎంచుకున్నామని అన్నారు.

# పాక్ రెచ్చగొడితే తీవ్ర పరిణామాలు

- పాకిస్తాన్ దాడి చేస్తే, తీవ్ర ప్రతీకారం తప్పదు..
- దాయాదికి ఎన్ఎస్ఏ అజిత్ దోవల్ వార్నింగ్..

**ఢిల్లీ:** పహల్గామ్ ఉగ్రదాడికి భారత్ ''ఆపరేషన్ సిందూర్''తో ప్రతీకారం తీర్చుకుంది. పీఓకే, పాకిస్తాన్ లోని మొత్తం 09 ఉగ్రస్థావరాలపై 24 దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో లష్కరే తోయిబా, జైషే మహ్మద్ ఉగ్రవాదులు పదుల సంఖ్యలో మరణించారు. అయితే, ఈ దాడుల గురించి జాతీయ భద్రతా సలహాదారు(ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ ప్రపంచదేశాలకు



వివరించారు. భారతదేశానికి ఉద్రిక్తతల్ని పెంచే ఉద్దేశ్యం లేదని, ఒక వేళ పాకిస్తాన్ దాడి చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, దృఢంగా ప్రతీకారం తీర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు మిత్ర దేశాలకు వెల్లడించారు.పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్(పీఓకే)లో ఉగ్రవాద స్థావరాలపై భారత్ ఎటాక్ చేసిన తర్వాత, అజిత్ దోవల్ యూకే, యూఎస్, సౌదీ అరేబియా, జపాన్, రష్యా, ఫ్రాన్స్ లతో మాట్లాడారు. తాము ఉగ్రవాద స్థావరాలను మాత్రమే టార్గెట్ చేశామని, సామాన్య ప్రజలు, పాక్ ఆర్మీ ఆస్తులపై దాడులు నిర్వహించ లేదని తెలిపారు. భారత్ తీసుకున్న చర్యలు, అమలు చేసిన విధానం గురించి దోవల్ తన సహచరులతో పంచుకున్నారు.భారత్ కు ఘర్షణను పెంచే ఉద్దేశ్యం లేదని, కానీ పాకిస్తాన్ తీవ్ర తరం చేయాలనుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. దోవల్ అమెరికా ఎన్ఎస్, విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, యూకే జోనాథన్ పావెల్, సౌదీ అరేబియా ఎన్ఎస్ఏ ముసైద్ అల్ ఐబాన్, యూఏఈ అధికారి షేక్ తహ్నూన్, జపాన్ అధికారి మసటాకా ఒకానోలతో మాట్లాడారు. చైనా సీపీసీ సెంట్రల్ కమిటీ పోలిట్ బ్యూరో సభ్యుడు, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి, ఫ్రెంచ్ అధ్యక్షుడి దౌత్య సలహాదారు ఇమ్మాన్యయేల్ బోనేతో మాట్లాడారు.

# అందుకే.. ఆపరేషన్ సింధూర్

- పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలపై భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌పై భారత త్రివిధ దళాల అధికారులు స్పందించారు.
- మీడియాతో మాట్లాడుతూ గతంలో పార్లమెంట్‌పై దాడి నుంచి తాజాగా జరిగిన పహల్గామ్ దాడి వరకూ మొత్తం 350 మంది పౌరులు మృతి చెందారని చెప్పారు.
- పీవోకే, పాక్ లోని ఉగ్రవాదుల స్థావరాలే లక్ష్యంగా దాడులు చేశాం
- ముర్కిదే క్యాంపుపై దాడి చేశాం ఇక్కడ నుంచే ముంబై పేలుళ్ల దాడి జరిగింది
- కసబ్ ఇక్కడే ట్రైనింగ్ తీసుకున్నాడు..



**ఢిల్లీ:** పాకిస్తాన్ లోని ఉగ్రస్థావరాలపై భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ పై భారత త్రివిధ దళాల అధికారులు స్పందించారు. మీడియాతో మాట్లాడుతూ గతంలో పార్లమెంట్ పై దాడి నుంచి తాజాగా జరిగిన పహల్గామ్ దాడి వరకూ మొత్తం 350 మంది పౌరులు మృతి చెందారని చెప్పారు. అలాగే 600 మందికి పైగా సైనికులు మృతిచెందారన్నారు. ఇకపై ఇలాంటివి జరగకుండా ఉండేందుకే ఆపరేషన్ సింధూర్ చేపట్టినట్లు తెలిపారు. పహల్గామ్ లో పౌరులను విచక్షణారహితంగా కాల్చి చంపారని, ఈ దాడిలో 25 మంది భారతీయ పౌరులు, ఒక నేపాలీ మృతిచెందారని చెప్పారు. పహల్గామ్ దాడి అత్యంత హేయమైనదని తెలిపారు. ముంబై దాడుల తర్వాత ఇదే పెద్ద దాడి అని, జమ్మూకశ్మీర్ అభివృద్ధిని అడ్డుకోవడమే ఉగ్రవాదుల పన్నాగమని చెప్పారు.ఉగ్రవాదాన్ని అరికట్టడంలో ఐరాస విఫలమైందని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు. TRF అనేది లష్కరే తొయిబాకు ఒక ముసుగు వంటిదన్నవారు. ఉగ్రసంస్థల కోసమే TRF పనిచేస్తోందన్నారు. నిఘా వ్యవస్థల ద్వారా ఉగ్రదాడులకు పాల్పడ్డవారిని గుర్తించామని చెప్పారు. అంతర్జాతీయ వేదికలపై ప్రపంచ దేశాలను పాక్ తప్పుదారి పట్టిస్తోందని, ఉగ్రవాదానికి పాకిస్థాన్ స్వర్గధామంగా మారిందని దుయ్యబట్టారు. భారత్ పై రానున్న రోజుల్లో ఉగ్రదాడి జరిగే అవకాశం ఉందని.. నిఘా వర్గాలు హెచ్చరించాయన్నారు. ఉగ్రసంస్థల మౌలిక వసతులు ధ్వంసం చేసేందుకే సరిహద్దు దాటి భారత్ దాడి చేసిందని స్పష్టం చేశారు. పహల్గామ్ దాడి తర్వాత పాక్ ఎలాంటి దిద్దుబాటు చర్యలు చేపట్టలేదని తెలిపారు. పహల్గామ్ దాడిలో మరో కుట్ర కూడా ఉందని, కశ్మీర్ తో పాటూ దేశంలో విద్వేషాలు రెచ్చగొట్టాలని చూశారని తెలిపారు.కశ్మీర్ ను గతేడాది 2.3కోట్ల మంది పర్యాటకులు సందర్శించారని రక్షణశాఖ అధికారులు తెలిపారు. జమ్మూకశ్మీర్ పర్యాటకంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతోందన్నారు. పహల్గామ్ దాడితో ఇదంతా దెబ్బతీయాలని చూశారని చెప్పారు. అందుకే ఉగ్రవాదులకు సరైనరీతిలో బుద్ధి చెప్పామని వివరించారు. పాక్ లో ఉగ్రసంస్థలు ఉన్నాయని 2023లోనే ఐరాస దృష్టికి తీసుకెళ్లామని గుర్తు చేశారు. పాకిస్తాన్ సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూనే ఉందన్నారు. ఇక ముందు కూడా ఉగ్ర చర్యలను భారత్ ఉపేక్షించదని, దాడులకు పాల్పడే వారిని కచ్చితంగా శిక్షిస్తామన్నారు. పాకిస్తాన్ లోని 9 ఉగ్రవాద శిబిరాలపై భారత్ దాడి చేసిందని, భారత్ చేసిన దాడి బాధ్యతాయుతమైనదంటూ భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు.

**కసబ్ ఇక్కడే ట్రైనింగ్ తీసుకున్నాడు**

కల్నల్ సోఫియా ఖురేషి ఆపరేషన్ సింధూర్ గురించి మాట్లాడుతూ.. మే 6, 7 తేదీలలో భారత సైన్యం జైషే, హిజ్బుల్ స్థావరాలను ఎలా ధ్వంసం చేసిందో ఆయన వివరించారు. గత మూడు దశాబ్దాలుగా పాకిస్తాన్ లో ఉగ్రవాదులను సృష్టిస్తున్నారని కల్నల్ సోఫియా అన్నారు. పాకిస్తాన్, పీఓకేలలో తొమ్మిది లక్ష్యాలను గుర్తించి ధ్వంసం చేసాము. లాంచ్ ప్యాడ్ లు, శిక్షణా కేంద్రాలను లక్ష్యంగా దాడులు జరిపామని అన్నారు. 25 నిమిషాల పాటు ఆపరేషన్ సింధూర్ జరిగింది..పౌరులు లేని ప్రాంతాల్లోనే టార్గెట్ చేశాం.. పీవోకే, పాక్ లోని ఉగ్రవాదుల స్థావరాలే లక్ష్యంగా దాడులు చేశాం.. కచ్చితమైన ఇంటెలిజెన్స్ సమాచారంతోనే దాడులు చేశామన్నారు. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ (పిఓకె)లో మొదటి లష్కర్ శిక్షణా కేంద్రం సవాయి నాలా ముజఫరాబాద్ లో ఉందని సోఫియా, వ్యోమిక విలేకరుల



సమావేశంలో తెలిపారు. సోనామార్గ్, గుల్మార్గ్, పహల్గామ్ దాడులకు పాల్పడిన ఉగ్రవాదులు ఇక్కడ శిక్షణ పొందారు. ఈ శిక్షణా కేంద్రాన్ని సైన్యం ధ్వంసం చేసిందని అన్నారు.రక్షణ శాఖ అధికారులు మాట్లాడుతూ.. నియంత్రణ రేఖ నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న ముజఫరాబాద్ లోని ఎల్ఈటీ క్యాంపుపై తొలి దాడి చేశాం.. ఎల్ఓసీలోని బింబల్ క్యాంపులో దాడి చేశాం.. ఇక్కడే లాష్కరే తోయిబా ఉగ్రవాదులకు ట్రైనింగ్ జరుగుతుంది.. పాకిస్తాన్ లోని సర్జల్ క్యాంపుపై దాడి చేశాం.. సర్జల్ క్యాంప్ ఎల్ఓసీకి 8 కిలోమీటర్ల దూరంలో ఉంది.. ముర్కిదే క్యాంపుపై దాడి చేశాం.. ఇక్కడ నుంచే ముంబై పేలుళ్ల దాడి జరిగింది.. కసబ్ ఇక్కడే ట్రైనింగ్ తీసుకున్నాడు.. ఈ దాడిలో భారత్ కు ఎలాంటి నష్టం జరగలేదు.. ఇది భారత సాయుధ దళాల ప్రణాళికబద్ధ దాడికి నిదర్శనమని అన్నారు.

# రాష్ట్రపతితో ప్రధానిమోదీ భేటీ



**ఢిల్లీ:** భారత రాష్ట్రపతి, సర్వసైన్యాధ్యక్షులు ద్రౌపతి ముర్ముతో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. పాకిస్తాన్ పై భారత్ సైన్యం జరిపిన ఆపరేషన్ సిందూర్ సైనిక చర్యను రాష్ట్రపతికి వివరించారు. పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ (PoK) లోని ఉగ్రస్థావరాలపై భారత సైన్యం జరిపిన దాడులు, ఉగ్రవాదులను అంతమొందించిన తీరును ప్రధాని తెలిపారు.పాకిస్తాన్ లో మొత్తం 9 ఉగ్రవాదుల అడ్డాగా ఉన్న ప్రదేశాలపై భారత వైమానిక దళం దాడులు జరిపింది. పాకిస్తాన్ కేంద్రం పనిచేస్తున్న ఉగ్రవాద సంస్తలు లష్కరే తోయిబా (LeT), జైషే మహ్మద్(JeM) ఉగ్రవాద ప్రధానా కార్యాలయాలు, శిక్షణా సంస్థలను లక్ష్యంగా తొమ్మిది ప్రదేశాల్లో వైమానిక దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ ప్రదేశాలనుంచే భారత్ లో ఉగ్రదాడికి ప్రణాళికలు చేసినట్లు తెలిపారు. ఏప్రిల్22న జమ్మూకాశ్మీర్ లోని పహల్గాం సమీపంలో బైసారన్ పర్యాటక ప్రాంతంలో ఉగ్రవాదులు జరిపిన అమానుష దాడిలో 26 మంది అమాయకపు టూరిస్టులు చనిపోయారని ప్రధాని మోదీ రాష్ట్రపతికి వివరించారు.ఈక్రమంలో ఉగ్రవాదం అంతమొందించాలనే లక్ష్యంగా భారీత్ ఉగ్రస్థావరాలపై ఈ దాడులు జరిపినట్లు వెల్లడించారు. మరోవైపు ప్రధాని మోదీ తన యూరప్ పర్యటనను రద్దు చేసుకున్నారు. భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న క్రమంలో ప్రధాని మోదీ మూడు దేశాల పర్యటనను వాయిదా వేసుకున్నారు. క్రొయేషియా, నార్వే, నెదర్లాండ్స్ పర్యటన షెడ్యూల్ ఉండగా వాయిదా పడింది. మే 13నుంచి 17 వరకు నార్వేలో జరిగే నార్డిక్ సమ్మిట్ లో ప్రధాని మోదా పాల్గొనాల్సి ఉండగా వాయిదా వేశారు.

# బార్డర్‌లో పాక్ ఆర్మీ విచక్షణారహిత కాల్పులు

- భారత్-పాక్ సరిహద్దులో ఉద్రిక్తత
- ఎల్‌వోసి వెంట పాక్ సైన్యం కాల్పులు
- 15 మంది భారత పౌరులు మృతి,43 మందికి గాయాలు



**ఢిల్లీ:** భారత్-పాక్ సరిహద్దులో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. జమ్ముకశ్మీర్ లోని ఎల్ వొసి వెంట పాక్ సైన్యం కాల్పులు జరుపుతోంది. పహల్గాం దాడి అనంతరం భారత్ 'ఆపరేషన్ సిందూర్ ' పేరుతో మెరుపు దాడులు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ రోజు ఉదయం పాక్ ఆర్మీ విచక్షణారహితంగా కాల్పులు జరిపింది. ఈ ఘటనలో 15 మంది భారత పౌరులు మృతి చెందారు. 43 మందికి గాయాలయ్యాయి. ఈ విషయాన్ని భారత ఆర్మీ ధృవీకరించి వివరాలు వెల్లడించింది. వెల్లడించింది.కాగా.. ఉగ్రస్థావరాలపై భారత్ మెరుపు దాడిలో జరిపిన విషయం తెలిసిందే. పాకిస్థాన్ లో 4, పీఓకేలో 5 ఉగ్ర స్థావరాలపై భారత్ దాడులు జరిగాయి. ఈ ఆపరేషన్ సిందూర్ లో 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. 42 మంది మృతదేహాలను గుర్తించినట్లు సమాచారం.. గాయపడిన ఉగ్రవాదులకు పాక్ ఆర్మీ వైద్య చికిత్స అందిస్తోంది. మరోవైపు.. శత్రుదేశం దాడులు చేస్తే సురక్షితంగా ప్రాణాలు కాపాడుకోవడంపై అవగాహన కల్పించేందుకు సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా దాదాపు 300 ప్రాంతాలను ఎంపిక చేశారు. వైమానిక దాడులు, బాంబు దాడులు జరిగితే ఎలా రక్షించుకోవాలో ప్రజలు, విద్యార్థులకు తెలియజేయనున్నారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు చేపట్టాల్సిన చర్యలపై కేంద్ర మార్గదర్శకాలను అనుసరించి ఈ డ్రిల్స్ చేపడుతున్నారు.

# నా కడుపు కోత మరెవరికీ రాకూడదు



**నెల్లూరు :** తన కొడుపు కోత మరెవరీ రాకూడదని ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన నెల్లూరుకు చెందిన మధుసూదన్ రావు తల్లి పద్మావతి అన్నారు. భారత జవాన్లు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయంతంపై ఆమె స్పందించారు. ఉగ్రవాదులు ఒక్కరూ కూడా ఉండకూడదని ఆకాంక్షించారు. అదీ కూడా భారత్ నే చేయాలన్నారు. ఇక నుంచి ఉగ్రవాదుల చేతుల్లో ఎవరి ప్రాణాలు పోగోకూడదని చెప్పారు. ఎన్ని యుద్ధాలు చేసినా తన కుమారుడిని తిరిగి తీసుకురాలేరని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబానికి ఉగ్రవాదులు తీరని ద్రోహం చేశారని మండిపడ్డారు. ఉగ్రవాదులు మరెవరినీ చంపకుండా భారత్ గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. అమాయక టూరిస్టులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులు హతం కావాల్సిందేనని పద్మావతి కోరుకున్నారు.

# "ఆపరేషన్ సింధూర్" విజయోత్సవ సంబరాల్లో

- సైనికులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి పొన్నం.
- "ఆపరేషన్ సింధూర్" విజయోత్సవ సంబరాల్లో పాల్గొన్న మంత్రి
- హుస్నాబాద్ నియోజకవర్గం కొహెడలో సంబరాల్లో పాల్గొన్న మంత్రి.



**హుస్నాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** నేడు ఉదయం పాకిస్తాన్ పై భారత్ చేసిన 'ఆపరేషన్ సింధూరం' విజయం కావడంతో దేశమంతటా విజయోత్సవ సంబరాలు కొనసాగుతున్నాయి. ఇక ఈ "ఆపరేషన్ సింధూర్" విజయవంతంపై హుస్నాబాద్ నియోజకవర్గం కొహెడలో మంత్రి పొన్నం ప్రభాకర్ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన హర్షం వ్యక్తం చేసారు. భారత్ మాత కి జై అంటూ నినాదాలు చేస్తూ సంబరాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానిస్తూ.. జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ టూరిస్టుల పై ఉగ్రవాదుల దాడి కి నిరసనగా ఆపరేషన్ సింధూర్ భారత ప్రభుత్వం చేపట్టిందని, భారత ప్రభుత్వం ఉగ్రవాద స్థావరాల పై చేసిన దాడి ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడం పై గట్టి చప్పట్లతో అభినందనలు తెలుపుతున్నట్లు ఆయన అన్నారు. రాజకీయాలకు అతీతంగా.. పార్టీలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలకు పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ఆయన అన్నారు.కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వంతో పాటు అన్ని పార్టీల నాయకులు ఈ చర్యను సమర్థిస్తున్నాయని, హుస్నాబాద్ లో ప్రజలు కూడా సంబరాలు చేస్తున్నారని ఆయన అన్నారు. ప్రజలందరూ ఉగ్రవాదుల చర్యలకు బుద్ధి చెప్పే విధంగా సైనిక చర్యలు ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని, దేశ సమగ్రతకు పాటుపడుతున్న సైనిక చర్యలకు మద్దతు ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సైనికులకు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు మంత్రి పొన్నం.

# సిడబ్ల్యూసి ఛైర్మన్‌తో మంత్రి భేటీ

- కేంద్ర జల సంఘం" (సిడబ్ల్యుసి) ఛైర్మన్ అతుల్ జై తో సమావేశమైన తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి.
- సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు.
- మేడిగడ్డ డ్యామ్ కూలిపోవడం పై జాతీయ డామ్ సంరక్షణ సంస్థ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై చర్చ.
- సమ్మక్క, సారక్క, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు. కృష్ణానది పై పలు చోట్ల టెలిమెట్రి పరికరాలు ఏర్పాటు.



**ఢిల్లీ :** తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర జల సంఘం (CWC) ఛైర్మన్ అతుల్ జైతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మేడిగడ్డ, సమ్మక్క సారక్క, పాలమూరు-రంగారెడ్డి వంటి ప్రధాన ప్రాజెక్టులపై చర్చ జరిగింది. రాష్ట్ర నీటిపారుదల శాఖకు చెందిన ఉన్నతాధికారులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు.ఇక మేడిగడ్డ డ్యామ్ కూలిపోవడంపై "జాతీయ డ్యామ్ సంరక్షణ సంస్థ" (NDSA) ఇప్పటికే నివేదికను సమర్పించింది. ఈ నివేదికలో మేడిగడ్డ డిజైన్, ఆపరేషన్ లో లోపాలున్నాయని స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్.. ప్రజాధనాన్ని దుర్వినియోగం కాకుండా, ప్రాజెక్ట్ పునరుద్ధరణకు సరైన మార్గాలను అన్వేషిస్తున్నాం అని పేర్కొన్నారు. డీపీఆర్ లో చూపిన స్థలం ఒకటి కాగా, అసలు నిర్మాణం వేరే ప్రాంతంలో జరిగిందని ఆయన విమర్శించారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీల విషయంలో కేంద్ర జల సంఘంతో సంప్రదింపులు కొనసాగించాల్సిన అవసరం ఉందని ఎన్డీఎస్సీ సూచించిందని చెప్పారు.అలాగే నూతన నిర్మాణాలు, కేటాయింపులపై ఆయన చర్చించారు. ఇందులో భాగంగా మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలను పునరుద్ధరించాలా లేదా అనే అంశంపై తుది నిర్ణయం తీసుకోలేదని మంత్రి తెలిపారు. అలాగే తుమ్మిడి హట్టి వద్ద కొత్త ప్రాజెక్టును నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఇంకా సమ్మక్క సారక్క ప్రాజెక్టుకు 44 టీఎంసిల నీటిని త్వరితగతిన కేటాయించాలని కోరారు. వీటితోపాటు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు మొత్తం 90 టీఎంసిలు అవసరమని, తక్షణమే 45 టీఎంసులను ముందుగా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఇక ముఖ్యంగా కృష్ణా నది నుంచి అక్రమంగా నీటిని తరలించకుండా నియంత్రణ అవసరమని మంత్రి స్పష్టం చేశారు. ఈ మేరకు నదిపై వివిధ ప్రదేశాల్లో టెలిమెట్రీ పరికరాలను ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరారు. అలాగే, పోలవరం బ్యాక్ వాటర్ వల్ల ముంపు ప్రమాదం ఉందని పేర్కొంటూ రిటెన్షన్ వాల్ నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# పాతబస్తీలో ఉన్న వారిని దేశం దాటిస్తేనే మనం సేఫ్



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కీలక విజ్ఞప్తి చేశారు. మన రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే వారిని వెంటనే దేశం దాటించాలని కోరారు. ట్విట్టర్ వేదికగా వీడియో విడుదల చేసిన ఆయన.. పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా రాజాసింగ్ మాట్లాడుతూ.. ఇవాళ దేశ వ్యాప్తంగా మంచి వాతావరణం ఉందని, పహల్గామ్ లో మన భారతీయుల మీద దాడి చేసిన ఉగ్రవాదుల స్థావరాలపై ఇండియన్ ఆర్మీ దాడి చేసి చంపేసిందని తెలిపారు.దాదాపు 90 నుంచి 100 మంది ఉగ్రవాదులు మరణించారని వార్తల్లో వస్తుందని చెప్పారు. అయితే అంతకుముందు భారతదేశంలో ఉన్న రోహింగ్యా , పాకిస్తాన్ , బంగ్లాదేశ్ దేశాల వారి లెక్కలు తీసి ఎక్కడివారు అక్కడికి వెళ్లిపోవాలని ఆదేశించారని, దీంతో కొందరు వెళ్లిపోయారు. కానీ హైదరాబాద్ ఓల్డ్ సిటీ లో చాలామంది ఇంకా ఉండొచ్చని తెలిపారు. ఇవాళ భారతదేశం జిందాబాద్ అని చెప్పే వాళ్లే.. వాళ్లని ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని అన్నారు.దాదాపు 15 వేల నుంచి 20 వేల మంది రోహింగ్యా, బంగ్లాదేశ్, పాకిస్తానీయులు హైదరాబాద్ పార్లమెంట్ లో తలదాచుకున్నారని, ఎంఐఎం పార్టీ వారికి రక్షణగా ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. వీరందరికి ఆధార్, ఓటర్ కార్డులు ఉన్నాయని, వీటిని గుర్తించడంతో పాటు రద్దు చేసి, వారిని తిరిగి వారి దేశాలకు పంపించాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. దాడుల నేపథ్యంలోనే మన రాష్ట్రాన్ని మనం కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, వీరందరినీ వెంటనే వారి దేశాలకు పంపిస్తే మనల్ని మనం కాపాడుకోవచ్చని సీఎంకు రాజాసింగ్ సూచించారు.

# ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడు

- ఆపరేషన్ సింధూర్ పై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రివ్యూ
- భారత సైన్యానికి సంఘీభావంగా నేడు సాయంత్రం 6 గంటలకు ర్యాలీ
- సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు ర్యాలీ.. హాజరుకానున్న సీఎం రేవంత్, మంత్రులు, ఇతర నేతలు



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** పహెల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో రాజకీయాలకు తావు లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఉదయం కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ఆర్మీ, పోలీస్, డిజాస్టర్ మేనేజ్ మెంట్, ఇతర సంబంధిత వివిధ విభాగాల ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. అత్యవసర సర్వీస్ లు అందించే విభాగాల ఉద్యోగుల సెలవులు రద్దు చేస్తూ ఈ సమావేశంలో సీఎం నిర్ణయం తీసుకున్నారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి అనధికారికంగా నివసిస్తున్న వారిని తక్షణమే అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు.

**విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలి:**

ఉద్యోగులు, మంత్రులు, అధికారులు అందరూ అందుబాటులో ఉండాలని సీఎం ఆదేశించారు. విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు మీడియా, సోషల్ మీడియాలో అనవసర ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అత్యవసర మెడిసిన్, ఆహార నిల్వలు తగినంత ఉండేలా చూడాలని, బ్లడ్ బ్యాంకు ల్లో రక్తనిలువలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో బెడ్స్ అందుబాటుపైన ఎప్పటికప్పుడు సమాచారం తీసుకోవాలన్నారు. రెడ్ క్రాస్ సమన్వయం చేసుకోవాలని సూచించారు. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులో ఉంచాలన్నారు. ఫేక్ న్యూస్ వల్ల ప్రజల్లో మరింత ఆందోళన పెరిగే అవకాశం ఉందని ఫేక్ న్యూస్ ప్రచారం చేసే వారిపైన ఉక్కు పాదం మోపాలన్నారు. ఫేక్ న్యూస్ ను అరికట్టడానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని సూచించారు.

**భద్రత పెంచండి:**

అన్ని జిల్లా కేంద్రాలతో పాటు సున్నిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండటంతో పాటు భద్రతను పెంచాలని శాంతి భద్రతల కు భంగం కలుగించే వారిపైన కఠినంగా వ్యవహరించాలని సీఎం సూచించారు. హైదరాబాద్ లోని మూడు కమిషనరేట్ల పరిధిలో సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూం కి అనుసంధానం చేయాలన్నారు. హైదరాబాద్ లోని అన్ని విదేశీ రాయబార కార్యాలయాలు, ఐటీ సంస్థల వద్ద భద్రత పెంచాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ సెక్యూరిటీ మీద దృష్టి సారించాలన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ లో సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అవసరమైతే పీస్ కమిటీ లతో మాట్లాడాలని హిస్టరీ షీటర్ లపైన, పాత నేరస్తుల పట్ల పోలీస్ డిపార్ట్ మెంట్ అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలించారు.

**సైన్యానికి సంఘీభావంగా నేడు ర్యాలీ:**

దేశ సైన్యంతో మనమంతా ఉన్నామనే సందేశం ఇచ్చేలా భారత సైన్యానికి సంఘీభావంగా నేడు సాయంత్రం 6 గంటలకు సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ర్యాలీలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఇతర నేతలు హాజరుకానున్నారు.

**ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడు**

భారత సాయుధ బలగాలు కొనసాగిస్తున్న ఆపరేషన్ సిందూర్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ రేవంత్ రెడ్డి గారు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. పాకిస్తాన్ మరియు పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే)లోని ఉగ్రవాద కేంద్రాలపై భారత సైన్యం నిర్వహించిన నిర్దేశిత దాడులు దేశ ప్రజలందరినీ గర్వపడేలా చేశాయని పేర్కొన్నారు. ఈ సమయంలో ప్రతి పౌరుడు భారత సైనికులకు అండగా సంఘీభావంగా, ఐక్యంగా నిలబడాలని కోరారు."ఒక భారతీయ పౌరుడిగా, నేను ముందుగా మన సాయుధ దళాలకు బలంగా అండగా నిలుస్తున్నాను. ఉగ్రవాద నిర్మూలన కోసం భారత సైన్యం చేపట్టిన ఈ ధైర్యవంతమైన చర్య దేశ భద్రతకు నిదర్శనం. ఈ దాడులు మన సైన్యం సామర్థ్యం, ధైర్యాన్ని ప్రపంచానికి స్పష్టంగా చాటాయి. మనమంతా ఒకే గొంతుకై, ఒకే స్వరం వినిపిద్దాం - జై హింద్!" అని ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు.ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ముఖ్యమంత్రి గారు హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్మీ, పోలీస్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ మరియు ఇతర సంబంధిత విభాగాల ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నారు. దేశ రక్షణలో హైదరాబాద్ వ్యూహాత్మక కేంద్రంగా ఉండటంతో, తాజా పరిస్థితులపై, తీసుకోవాల్సిన అప్రమత్త చర్యలపై ఆయా విభాగాలకు ముఖ్యమంత్రి గారు దిశానిర్దేశం చేయనున్నారు.తాజా పరిణామాల నేపథ్యంలో ప్రజలెవరూ భయభ్రాంతులకు గురికాకుండా, అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి గారు విజ్ఞప్తి చేశారు. ఏవైనా అనుమానాస్పద విషయాలు కనిపిస్తే వెంటనే పోలీసు విభాగానికి సమాచారం అందించాలని సూచించారు.

# పేదవారి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం



**ఏటూరునాగారం,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ చిత్తశుద్ధితో అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అమలు చేస్తున్నామని, పేద వాడి కలలను నిజం చేయడానికి ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం ములుగు జిల్లాలోని వాజేడు మండలం టేకులగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజా, నాగారం నుండి పాయబట్ల వరకు 400 లక్షలు తో బి.టి రోడ్డు నిర్మాణ పనులు, 1.50 లక్షల అంచనా విలువ తో వాజేడు మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవన నిర్మాణం, ఎడ్చర్లపల్లి నుండి ముత్తారం వరకు 300 లక్ష తో బి.టి. రోడ్డు నిర్మాణం పనులను శంకుస్థాపనలు, 14 లక్షలతో నిర్మించిన బేబీ బర్త్ వెయిటింగ్ భవనము ను రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, భద్రాచలం శాసనసభ్యులు డా. తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ శబరిష్ , ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రా లతో కలిసి ప్రారంభించినారు.అనంతరం కొంగాల గ్రామంలో 57 మందికి , నాగారం గ్రామంలో 64 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు మంత్రి అందచేశారు.అనంతరం వెంకటాపురం మండలం కేంద్రం లో 60 లక్షల నిధులతో ఉపకార్య నిర్వాహక ఇంజనీర్ (పి.ఆర్) కార్యాలయ భవన నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాప న చేశారు. పాత్రపురం గ్రామంలోని రైతు వైదిక లో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు మంత్రి అందచేశారు. ఈ సందర్భంగా పలుచోట్ల ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రంలో 8 లక్షల 19 వేల కోట్ల రూపాయల అప్పులు చేసి ప్రజలపై పెను భారం మోపిందని, ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గత పాలకులు చేసిన అప్పులు తీర్చడంతో పాటు సంక్షేమ ఫలాలను అమలు చేస్తున్నాన్నారు. ప్రతి నిరుపేద ఆడబిడ్డకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నిరుపేద కుటుంబానికి 5 లక్షల రూపాయలతో ఇండ్లను నిర్మించుకోవడానికి అవకాశం కల్పించిందని, వాజేడు, వెంకటాపూరం మండలాలలో నిరుపేదలు ఇండ్లు నిర్మించుకోవడానికి, పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఈరోజు శంకుస్థాపనలు చేయడం జరుగుతుందని తెలిపారు. గత ఎన్నికలకు ముందు ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు నూతన హామీలను అమలు చేయడానికి కార్యక్రమాలను చేపట్టిన ఈ సంవత్సరం ఉగాది నుండి ధనికుడు తినే సన్నబియ్యాన్ని పేదలకు అందించాలని లక్ష్యంతో ప్రతి ఒక్కరికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం అందజేస్తున్నామని అన్నారు. గతంలో పాలించిన దొర కాలంలో అరకొరగా ఉద్యోగ అవకాశాలు కల్పించగా నేటి ప్రజా ప్రభుత్వం పది నెలల కాలంలోనే 57 వేల 662 ఉద్యోగ అవకాశాలు కల్పించిందని, రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం భూ భారతి చట్టం తెచ్చి పేద రైతులకు చుట్టంగా మార్చిందని అన్నారు.రాష్ట్రంలోని నిరుద్యోగులకు భరోసా కల్పించాలని ఉద్దేశంతో రాజీవ్ వికాస్ పథకం కింద ఆర్థిక సహాయం చేయాలని లక్ష్యంతో అర్హులైన వారి నుండి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని, అర్హులైన వారందరికీ జూన్ 2వ తేదీన ఆరువేల కోట్ల రూపాయలను అందజేయడం జరుగుతుందన్నారు. నిరుపేద విద్యార్థినీ, విద్యార్థులకు నూతన పరిజ్ఞానంతో విద్యను బోధించడానికి చర్యలు తీసుకోవడంతో పాటు నిరుపేదలు రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద వైద్య సేవలు పొందడానికి పది లక్షల రూపాయలను పెంచడం జరిగిందన్నారు. పేదవారి ఆశయాన్ని నెరవేర్చడం కోసం రాష్ట్రంలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను చేపట్టడం జరుగుతుందని, రానున్న రోజులలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి మెరుగుపడిన అనంతరం నూతన పథకాలను అమలు చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. అనంత రం ఎమ్మెల్యే తెల్లం వెంక ట్రావు మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని గ్రామాల నిరుపేద ప్రజలకు అదనంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని మంత్రి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. తన నియోజకవర్గం పరిధిలోని వాజేడు, వెంకటాపురం మండలాలలోని అన్ని గ్రామాలలో అన్ని వర్గాల నిరుపేద ప్రజలు ఉన్నారని వారందరికీ దశలవారీగా ఇండ్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. పేదవారి సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తుందని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులైన నిరుపేదల అందరికీ అందే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. తాను ఎన్నికల ముందు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేస్తానని తెలిపారు. ఈ కార్య క్ర మంలో ములుగు జిల్లా కలెక్ట ర్ దివాక ర టి.ఎస్ , ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా, జిల్లా ఎస్పీ శ భ రీష్ , ఏటూరునాగార ఏఏస్పీ శివం ఉపాధ్యాయ , సంబందిత శాఖల అధికారులు, గ్రామ స్తులు త దిత రులు పాల్గొన్నారు.

# హనుమంతుడి లంకా దహనమే

## ఆపరేషన్ సిందూర్ కి ఆదర్శం




**ఢిల్లీ :** పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాక్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్న సంగతి తెలిసిందే. అనేక పరిణామాల అనంతరం భారత ఆర్మీ మంగళవారం అర్ధరాత్రి "ఆపరేషన్ సిందూర్" పేరిట పాక్ ఆక్రమిత కాశ్మీర్ లోని ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి.. 80 మంది ముష్కరులను అంతమొందించింది. భారత్ ఇచ్చిన ఈ మాస్టర్ స్ట్రోక్ తో ఒక్కసారిగా ప్రపంచం ఉలిక్కి పడింది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ మీడియా సమావేశం నిర్వహించారు. ఒక్కడే వెళ్ళి లంకను పూర్తిగా తగులబెట్టి వచ్చిన హనుమంతుడిని ఆదర్శంగా తీసుకొని ఆపరేషన్ సిందూర్ నిర్వహించామని ప్రకటించారు.ప్రధాని మోడీ నేతృత్వంలో భారత్ సగర్వంగా తలెత్తుకుందని వెల్లడించారు. కచ్చితమమైన సమాచారంతోనే నిన్న రాత్రి ఉగ్రవాదుల స్థావరాలపై దాడులు చేసి వారిని మట్టుబెట్టామని పేర్కొన్నారు. పాక్ పౌరులు తమకు లక్ష్యం కాదని, అమాయకులను చంపిన వారినే అంతం చేశామని అన్నారు. దేశ భద్రతకు భంగం కలిగిస్తే సహించేది లేదని.. త్రివిధ దళాలకు దేశం మొత్తం సెల్యూట్ చేస్తోందని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ తో భారత సైన్యం చరిత్ర సృష్టించిందని పేర్కొన్నారు. రైట్ టు రెస్పాండ్ హక్కును వినియోగించుకొని ఉగ్రవాదుల స్థైర్యాలను ఘోరంగా దెబ్బతీశామని అన్నారు.

# పాకిస్తాన్ ప్రజలపై దాడిని వ్యతిరేకించిన సీపీఐ నారాయణ

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో పాకిస్తాన్ గత 12 రోజులుగా పీఓకే వద్ద కాల్పులు జరుపుతూ కవ్వింపు చర్యలు కొనసాగిస్తూనే ఉంది. దీంతో భారత్ దీటైన సమాధానం చెప్పేందుకు సిద్ధం అయింది. ఈ మేరకు ప్రధాని మోడీ భారత ఆర్మీకి పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. దీంతో మంగళవారం రాత్రి సమయంలో భారత్ పాకిస్తాన్ పై ఎయిర్ స్ట్రైక్ చేసింది. మొత్తం 9 ఉగ్రవాద కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని నిమిషాల వ్యవధిలోనే ఖచ్చితమైన దాడులు చేసింది. ఈ దాడిలో మొత్తం 90 మంది ఉగ్రవాదులు మృతి చెందినట్లు వార్తలు వస్తున్నాయి. కాగా ఆ ఆపరేషన్ సిందూర్ పై దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పార్టీలు, ప్రముఖులు స్పందిస్తూ మద్దతుగా నిలిచారు.ఇందులో భాగంగానే సీపీఐ నారాయణ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. తాజా దాడిపై ఆయన మాట్లాడుతూ ఓ వీడియోను విడుదల చేశాడు. ఆ దాడిలో ఉగ్రవాదులపై భారత ఆర్మీ జరిపిన దాడికి మద్దతు (దాడికి మద్దతు తె) తెలుపుతూనే.. పాకిస్తాన్ ప్రజలపై దాడి చేయడాన్ని ఖండించారు. తాము పాకిస్తాన్ పై యుద్ధం చేయడానికి వ్యతిరేకం అని సీపీఐ నారాయణ తేల్చి చెప్పారు. అలాగే ఉగ్రవాదులను హతమార్చడానికే భారత ఆర్మీ ట్రైనింగ్ తీసుకుందని, పాక్ పై యుద్ధం చేయడానికి కాదని చెప్పుకొచ్చారు. ఉగ్రవాదులను చంపడం న్యాయమే.. పాకిస్తాన్ కూడా ఉగ్రవాదుల నిర్మూలనలో భారత దేశానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ పోరు ఉగ్రవాదంపై మాత్రమే ఉండాలని, పాక్ పౌరులు, ప్రభుత్వంపై కాదని, అలా చేస్తే ఉగ్రవాదం మరింత బలోపేతమవుతుందని CPI నారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు.

# ఆపరేషన్ సిందూర్ పై కీలక వ్యాఖ్యలు



**అమెరికా:** పాకిస్తాన్ ఉగ్రవాదులపై మంగళవారం అర్ధరాత్రి భారత వాయుసేన ఆపరేషన్ సిందూర్ సిందూర్ పేరుతో ఎయిర్ స్ట్రైక్ చేసింది. ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకొని 9 ప్రాంతాల్లో ఈ దాడులు జరగ్గా 90 మంది ఉగ్రవాదులు మృతి చెందగా మరో 50 మంది వరకు గాయాలపాలై నట్లు తెలుస్తోంది. కాగా పాకిస్తాన్ ఉగ్రవాదులే లక్ష్యంగా చేసుకొని భారత్ చేసిన ఈ దాడికి పలు దేశాలు మద్దతు తెలుపగా మరికొన్ని దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. తాజాగా యూకే మాజీ ప్రధాని రిషి సునక్ ఆపరేషన్ సిందూర్ పై స్పందిస్తూ కీలక ట్వీట్ చేశారు. అందులో " ఏ దేశం కూడా మరొక దేశం నియంత్రణలో ఉన్న భూభాగం నుండి తమపై ఉగ్రవాద దాడులు జరగడాన్ని అంగీకరించవలసిన అవసరం లేదు.ఉగ్రవాద మౌలిక సదుపాయాల పై భారతదేశం దాడి చేయడం సమర్థనీయమే. ఉగ్రవాదులకు శిక్ష నుండి ఎటువంటి మినహాయింపు ఉండదు." అని రాసుకొచ్చారు. అంతకు ముందు ఆపరేషన్ సిందూర్ తర్వాత భారతదేశం-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంపై UK ఆందోళన వ్యక్తం చేసింది. "ఇరు దేశాల మధ్య ప్రస్తుతం ఉద్రిక్తతలు తీవ్రమైన ఆందోళన కలిగిస్తున్నాయి. వేగవంతమైన, దౌత్య మార్గాన్ని కనుగొనడానికి భారతదేశం, పాకిస్తాన్ లు సంయమనం పాటించాలని, ప్రత్యక్ష సంభాషణలో పాల్గొనాలని UK ప్రభుత్వం కోరుతోంది" అని UK విదేశాంగ కార్యదర్శి డేవిడ్ లామీ అన్నారు.

## సంపాదకీయం


# ఏం చేయాలి, ఏం చేయకూడదు?



యుద్ధం వంటి అత్యవసర పరిస్థితుల్లో పౌరులు ఎలా స్పందించాలనే విషయంపై సన్నద్ధత కోసం దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు బుధవారం (మే 7న) మాక్ డ్రిల్స్ ను చేపట్టాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది.పహల్గాంలో పర్యటకులపై జరిగిన దాడి తరువాత భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో మాక్ డ్రిల్స్ ముఖ్యమని భావిస్తున్నారు.దేశవ్యాప్తంగా ఉన్న 244 సివిల్ డిఫెన్స్ డిస్ట్రిక్స్ లో పౌర రక్షణ వ్యవస్థపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో ప్రజలకు తెలియజేసేందుకు ఈ మాక్ డ్రిల్స్ నిర్వహించాలని ప్రభుత్వం తన ఆదేశాల్లో పేర్కొంది.ఈ డ్రిల్స్ లో వైమానిక దాడులకు సంబంధించిన హెచ్చరికల సైరన్లు, దాడి జరిగినప్పుడు ఎలా రక్షించుకోవాలనే విషయంలో దేశ పౌరులకు, విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు.హోం మంత్రిత్వ శాఖ సివిల్ డిఫెన్స్ రూల్స్- 1968లో సెక్షన్ 19 ప్రకారం ఈ డ్రిల్స్ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.సాధారణంగా మాక్ డ్రిల్స్‌లో ఎంపిక చేసిన ప్రజలకు, వలంటీర్లకు ట్రైనింగ్ ఇస్తారు.నగరం నుంచి గ్రామీణ స్థాయి వరకు ప్రతి చోట ఈ మాక్ డ్రిల్స్ చేపట్టాలని హోం మంత్రిత్వ శాఖ



తన ఆదేశాల్లో పేర్కొంది.మాక్ డ్రిల్స్‌లో భాగంగా చాలా కార్యక్రమాలను చేపడతారు.ఈ సమయంలో ఇళ్లలో, సంస్థల్లో ఉన్న లైట్లను అన్నింటినీ కొంతసేపు ఆపివేయాలని ఆదేశాలు జారీ చేస్తారు.అత్యవసర పరిస్థితుల్లో పౌర రక్షణ వ్యవస్థ ఎలా స్పందిస్తుంది?ఒక నిర్దిష్ట ప్రాంతం నుంచి ప్రజలను సురక్షితంగా ఎలా తరలిస్తారనే దానిపైనా శిక్షణ ఉంటుంది.1971 తరువాత ఇలాంటి మాక్ డ్రిల్స్‌ను చేపట్టడం ఇదే తొలిసారి.1971లో ఇండో-పాకిస్తాన్ యుద్ధం (బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం) సమయంలో మాక్ డ్రిల్స్ నిర్వహించారని.. మళ్లీ ఐదు దశాబ్దాల తర్వాత, మాక్ డ్రిల్స్‌ను కేంద్రం చేపడుతోందని 'టైమ్స్‌నౌ' కథనం పేర్కొంది.1962లో చైనాతో, 1965, 1971లో పాకిస్తాన్‌తో భారత్ పూర్తి స్థాయి యుద్ధం చేసినప్పుడు మాత్రమే ఈ డ్రిల్స్‌ను చేసింది.మాక్ డ్రిల్స్ సందర్భంగా అప్పుడు భారత్ సైరన్‌లు మోగించింది. ఆ సమయంలో ప్రజలు కొద్దిసేపు తమ ఇళ్లలోని లైట్లను ఆపివేశారని 'ఫస్ట్ పోస్ట్' తన కథనంలో పేర్కొంది.అలాగే, తమ ఇళ్లలోని అద్దాలను కాగితంపై కవర్ చేశామని, ఒకవేళ బయట ఉంటే నేలపై పడుకుని, చెవులు మూసుకున్నట్లు కొందరు గుర్తు చేసుకున్నట్లు ఆ కథనంలో పేర్కొన్నారు.సివిల్ డిఫెన్స్ డిస్ట్రిక్స్‌లో మాక్ డ్రిల్స్‌ను నిర్వహించాలని కేంద్ర హోం శాఖ పేర్కొంది. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విశాఖపట్నం ఈ జాబితాలో ఉన్నాయి.బుధవారం జరగబోయే మాక్ డ్రిల్స్ హైదరాబాద్, విశాఖపట్నంలో చేపట్టనున్నారు.సివిల్ డిఫెన్స్ డిస్ట్రిక్స్‌ను మూడు కేటగిరీలుగా విభజించారు. తెలుగు రాష్ట్రాల్లోని రెండు ప్రాంతాలు కేటగిరీ- 2లో ఉన్నాయి.దేశ రాజధాని దిల్లీ కేటగిరీ 1లో ఉంది.పెద్ద ఎత్తున ప్రజలు, వలంటీర్లు ఈ కార్యక్రమంలో పాలు పంచుకోవాలని కేంద్ర హోం శాఖ తెలిపింది.కోఆర్డినేషన్ కోసం జిల్లా అధికారులు ఈ డ్రిల్స్‌లో భాగమవుతారు.గ్రౌండ్ ఆపరేషన్స్ కోసం హోమ్ గార్డులు, సివిల్ డిఫెన్స్ వార్డెన్లు, వలంటీర్లు పాల్గొంటారు.ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ (నేషనల్ సర్వీసు స్కీమ్), ఎన్ఐకేఎస్ (నెహ్రూ యువ కేంద్ర సంఘటన్) వలంటీర్లు, స్కూల్-కాలేజీ విద్యార్థులు కూడా ఈ డ్రిల్స్‌లో పాలుపంచుకుంటారు.డ్రిల్స్ నిర్వహించిన తర్వాత, ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతం తప్పనిసరిగా 'యాక్షన్ టేకెన్ రిపోర్టు'ను ప్రభుత్వానికి సమర్పించాలి.భయపడకూడదు, స్థానిక అధికారులు జారీ చేసే మార్గదర్శకాలను పాటించాలి.నీరు, వైద్య సరఫరాలు, ఫ్లాష్‌లైట్లు సిద్ధంగా ఉంచుకోవాలి.ఊహాగానాలను, సోషల్ మీడియాలో వచ్చే ధ్రువీకరణ లేని వార్తలను పట్టించుకోకూడదు.కరెంట్ కానీ, ఇంటర్నెట్ కానీ ఆగిపోతే ఆందోళన చెందవద్దు. అధికారిక అప్‌డేట్ల కోసం రేడియో లేదా ప్రభుత్వ ఛానళ్లను ఫాలో కావాలి.వైమానిక దాడుల హెచ్చరిక వ్యవస్థలు సమర్థతను అంచనావేయడంభారత వైమానిక దళంతో అనుసంధానమై ఉన్న రేడియో/హాట్‌లైన్ లింక్స్ నిర్వహణను చూడటంకంట్రోల్ రూమ్‌లు, షాడో కంట్రోల్ రూమ్‌ల పనితీరును పరీక్షించడశత్రు దాడి జరిగినప్పుడు తమను తాము రక్షించుకోవడంపై పౌర రక్షణ వ్యవస్థలపై పౌరులకు, విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంక్రాష్ బ్లాక్ అవుట్ (యుద్ధాల సమయాల్లో నగరాల్లో ప్రజలు లైట్లను ఆపివేసే) చర్యలకు సంబంధించిన మార్గదర్శకాలు తెలియజేయడం. దీనివల్ల రాత్రిపూట వైమానిక దాడులు చేసేటప్పుడు, ప్రజలు ఉండే ప్రాంతాలను గుర్తించే ప్రమాదం తగ్గుతుంది. 1971లో ఈ విధానాన్ని భారత్ ఉపయోగించింది.సివిల్ డిఫెన్స్ సర్వీసులను యాక్టివేట్ చేయడం, వాటి స్పందన ఎలా ఉందో తెలుసుకోవడం. వార్డెన్ సర్వీసులు, ఫైర్‌ఫైటింగ్, రెస్క్యూ ఆపరేషన్స్, డిపో మేనేజ్‌మెంట్ ఈ పరిధిలోకి వస్తాయి.ప్రజలను తరలించే ప్రణాళికలు, వాటి అమలు సన్నద్ధతను అంచనావేయడం



# అష్టదిగ్బంధనతో పాక్ ఉక్కిరిబిక్కిరి !

యుద్ధమంటే నేరుగా పోరాటమొక్కటే కాదు...శత్రువును అష్టదిగ్బంధనం చేసి కదలకుండా చేయడం కూడా యుద్ధంలో ఓ భాగమే. పాక్ పరిస్థితి ఇప్పుడు అలాగే ఉంది. అది నిద్రలేని రాత్రులు గడుపుతోంది. ప్రపంచ దేశాలు నమ్మలేని దుస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. నిజంగానే యుద్ధం జరిగితే దాని పక్కన నిలబడానికి ఒక్కదేశం కూడా రాకపోవచ్చు. ఇప్పటికే అనేక రకాలుగా భారత్ పాక్‌ను ముప్పుతిప్పలు పెడుతోంది. పహల్గామ్ దాడి జరిగి పక్షం రోజులు పూర్తయ్యాయి. ఇంకా ఎప్పుడు దాడి చేస్తారని కొందరు అధికారంలో ఉన్న బిజెపిని నిలదీసే ప్రయత్నంలో ఉన్నారు. ఇలాంటి వారు యుద్ధతంత్రం గురించి తెలుసుకుంటే మంచిది. సామ,భేద, దాన, దండోపాయాలు అన్నవి యుద్ధంలో బాగా వాడే పదాలు. మొదటి మూడు విఫలమైన తరవాతనే నాలుగోది అయిన దండోపాయం చేపట్టాలి. రావణుడు యుద్దానికి సై అన్న తరుణం లోనూ అతడి పట్టపుమహిషి మండోదరి అడ్డుపడి సామ,భేద,దాన,దండోపాయల గురించి వివరిస్తుంది. రాముడిని మచ్చిక చేసుకుని బతిమాలి, బామాలి, క్షమించమని వేడుకొమ్మని అంటుంది. చేసిన తప్పును సరిదిద్దుకోమని హెచ్చరిస్తుంది. కానీ రావణుడు ఇవన్నీ మరచి యుద్ధంచేసి పారజితుడు అయ్యాడు. పాక్ కూడా ఉగ్రవాదం ఎగదోసే ప్రయత్నం నుంచి బయటపడి, తన ఉనికిని గుర్తించాలి. భారత్ నుంచి వివిడ్డ ముక్కనని గుర్తించాలి. అలా జ్ఞానోదయం కావాలి. అప్పుడే పాక్ ప్రపంచదేశాల్లో మనగలుగుతుంది. కానీ అలా చేయలేక ఉగ్రవాదాన్ని ఎగదోస్తూ తమదేశ ప్రజలను మభ్య పెడుతూ వస్తోంది. ఇప్పుడు పాపం పండింది. ఇంతకాలం ఒక లెక్క..ఇప్పుడో లెక్క. పహల్గామ్ దాడి తరవాత ఇప్పుడు భారత్ విసిరిన ఉచ్చులో పడి గిలగిల కొట్టుకుంటోంది. మోడీ కూడా ఇప్పుడు అదే వ్యూహంతో సాగుతున్నారు. ఇప్పటికే పాక్ యుద్ధభయంతో సైన్యాన్ని మోహరించింది. ఉగ్రవాద శిబిరాలను ఖాళీ చేయించింది. గగనతలంపై ఆంక్షలు విధిచడంతో పాక్ ముప్పు తిప్పలు పడుతోంది. అసలే పాక్ ఆర్థిక వ్యవస్థ అంతంతమాత్రంగా సాగుతున్న వేళ..పాక్‌ను అష్టదిగ్బంధనం చేయడంతో నానా ఇక్కట్లు పడుతోంది. మరోవైపు సింధుజలాల రాకను అడ్డుకుంది. దీంతో నీటి కోసం తపిస్తున్నారు. అలాగే పివోకెపై దాడి చేస్తారన్న భయంతో అక్కడ బలగాలను మోహరించారు. ఇకపోతే ఐక్యరాజ్యసమితలో కూడా తాజాగా పాక్‌కు చుక్కెదురయ్యింది. అంతర్జాతీయంగా కూడా భారత్ బలమైన మద్దతును కూడా గట్టింది. ఇవన్నీ కూడా పాక్‌ను దెబ్బతీస్తున్న ఘటనలుగానే చూడాలి. యుద్ధంలో ఇదొక భాగంగా చూడాలి. ఇలా చేయడం వల్ల అసలు యుద్ధంలో పాక్ అడుగు వేయలేని దుస్థితికి చేరుకుంది. పహల్గాంలో ఉగ్రదాడి ప్రతి భారతీయుని హృదయాన్ని తీవ్రంగా గాయపరిచింది. బాధితుల కుటుంబాల పట్ల ప్రతి భారతీయుడూ తీవ్ర సానుభూతి వ్యక్తం చేస్తున్నాడు. ఏ రాష్ట్రానికి చెందినవారైనా,ఏ భాష మాట్లాడేవారైనా ఆ ఉగ్రదాడిలో తమ ఆత్మీయులను కోల్పోయిన వారి బాధను అనుభవిస్తున్నారు. ప్రతి భారతీయుని రక్తం మరిగిపోతోంది. పాక్‌ను తుదముట్టించా లని ప్రతి ఒక్క భారతీయముడు కోరుకుంటున్నాడు. నిజానికి 370 ఆర్టికల్ రద్దు తరవాత కశ్మీర్‌లో మళ్లీ ప్రశాంత పరిస్థితులు నెలకొంటున్నాయి. పాఠశాలలు, కళాశాలలు కళకళలాడుతున్నాయి. విద్యావాతావరణం మళ్లీ చిగురించింది. నిర్మాణ రంగ కార్యకలాపాలు, అభివృద్ధి కార్యకలాపలు గతంలో ఎప్పుడూ లేని విధంగా వేగం పుంజుకున్నాయి. ప్రజాస్వామ్యం అక్కడ వికిసిస్తోంది. యువత స్వయం ఉపాధితో మళ్లీ శక్తిమంత మవుతోంది. పర్యాటకులు వెల్లువెత్తుతున్నారు. ప్రజల ఆదాయాలు గణనీయంగా పెరుగు తున్నాయి. యువత ఉపాధికి కొత్త అవకాశాలను సృష్టించడం జరుగుతోంది. అయితే పహల్గామ్ ఉగ్రవాద దాడితో పర్యాటకుల వెల్లువ నిలిచిపోయింది. సామాన్య కశ్మీరీల ప్రయోజనాలకు తీవ్ర భంగం వాటిల్లింది. పహల్గాంలో ఉగ్రవాద దాడి చోటుచేసుకున్న వెనువెంటనే ఆసేతు హిమాచలం అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు. మోదీ ప్రభుత్వం ఎటువంటి చర్య చేపట్టినా తాము సంపూర్ణంగా మద్దతునిస్తామని రాజకీయ పక్షాలు స్పష్టంగా ప్రకటించాయి. ఉగ్రదాడి ఘటన జరిగినప్పుడు సౌదీ అరేబియాలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన అధికారిక పర్యటనను మధ్యలోనే ముగించుకుని స్వదేశానికి తిరిగివచ్చారు. ఉగ్రదాడికి ఇంతకింత మూల్యం చెల్లించుకోక తప్పదని పాక్‌ను కఠినంగా హెచ్చరించారు. ఈ క్రమంలో తీసుకున్న చర్యల వల్లనే ఇప్పుడు పాక్ ఏకాకి అయ్యింది. దానికి ఇప్పుడు చైనా కూడా బహిరంగంగా మద్దతు ఇవ్వలేని దుస్థితి ఏర్పడింది. అందుకే పహల్గాం ఘటనపై తక్షణమే ప్రతీకార చర్యలు చేపట్టాలనే డిమాండ్లు దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్నాయి. మెరుపుదాడులకు పాల్పడే విమానాలను పాక్ సైనిక దళాలు ముందుగానే పసిగట్టి అడ్డుకుంటాయని సైనిక నిపుణులు గట్టిగానే చెబుతున్నారు. అటువంటి దాడుల ఫలితాలు ఆశించినవిగా ఉండకపోవచ్చని కూడా నిపుణులు అంటున్నారు. భారత్ సైనిక పాటవ ఆధిక్యత దృష్ట్యా సర్జికల్ స్ట్రయిక్స్ కన్నా ఇతరత్రా ప్రత్యామ్నాయాలు ఉన్నాయని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఈసారి దెబ్బకొడితే మళ్లీ పాక్ కోలుకోకుండా చేయాల్సి ఉంది. ఎందుకంటే గతంలో నెహ్రూ, ఇందిరల హయాంలో చేసిన తప్పుల వల్ల పివోకె అలాగే ఉండిపోయింది. పాక్ జుట్టు మన చేతిలో చిక్కినా వదిలి పెట్టాం. ఇలాంటి అనుభవాలన్నీ ఇప్పుడు మోడీ ప్రభుత్వం తప్పకుండా గణిస్తోంది. అందుకే సామ,భేద, దాన, దండోపాయాలపై కసరత్తు చేస్తున్నట్లుగా ఉంది. అమెరికా, రష్యాలు సైతం మద్దతుగా ఉన్నాయి. గల్ఫ్ దేశాలు కూడా పాక్‌ను నమ్మేస్థితిలో లేవు. పహల్గాం దాడులకు ప్రతీకారంగా ఎప్పుడు ఎలా ఎలాంటి చర్య తీసుకోవాలనే విషయమై సైనిక దళాలకు ప్రధానమంత్రి సంపూర్ణ స్వేచ్ఛనిచ్చినట్టు ప్రకటించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో జాతీయ భద్రతపై అత్యున్నత నిర్ణయాలు తీసుకునేది ప్రధానమంత్రి మాత్రమే. ఆ నిర్ణయాలను అమలుపరిచేది సైనిక దళాలు. పహల్గాంపై భారత్ ప్రతిస్పందన.. కశ్మీర్‌లో అల్లకల్లోలం సృష్టిస్తున్న శత్రు వర్గాలను అణచి వేయడం వంటివన్నీ ఇప్పుడు అమలు జరుగుతున్నాయి. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం వెనకా యుద్ధ తంత్రం దాగివుంది. అందుకే ప్రతి చర్యా పాక్‌ను కట్టడి చేసేలా ఉంటున్నాయి. భయంతో చస్తున్న పాక్ నేతలు అనవసర ప్రేలాపనలు పేలుతున్నారు. ఇదంతా అక్కడి ప్రజలకు కూడా తెలుసు. అందుకే అక్కడి పాలకులపై వ్యతిరేకత వస్తోంది తప్ప..భారత్‌పై పాక్ ప్రజల్ల ద్వేషం కానరావడం లేదు. ఉగ్రవాదాన్ని ఎగదోసే విధానం సరికాదని, పాక్ ప్రశాంతంగా ఉండాలి వారుకోరుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలు యుద్ధనీతిలో భాగంగా అనుసరిస్తున్నవిగా గుర్తించాలి. అలాగే మరిన్ని కఠిన చర్యలకు కూడా భారత్ సిద్దంగానే ఉందని కూడా గుర్తించాలి.

# మా వాళ్లు 8మంది చనిపోయారు

జమ్మూ కశ్మీర్ లోని పహల్గాంలో ఏప్రిల్ 22న తీవ్రవాదులు దాడులు జరిపి, 26మంది పర్యటకులు మరణించినప్పటి నుంచి భారత్, పాకిస్తాన్ మధ్య పరిస్థితులు ఉద్రిక్తంగా ఉన్నాయి.మే 7వ తేదీ తెల్లవారుజామున పాకిస్తాన్, పాకిస్తాన్ పాలిత కశ్మీర్ లోని 9 తీవ్రవాద స్థావరాలపై దాడులు జరిపినట్టు భారత ప్రభుత్వం ప్రకటించింది.ఈ దాడులలో తమ పౌరులు 8మంది చనిపోయారని, 35 మంది గాయపడ్డారని పాకిస్తాన్ విదేశాంగ మంత్రి మొహమ్మద్ ఇషాక్ దార్ చెప్పారు. తూర్పు అహ్మద్ పూర్ ప్రాంతంలో ఎక్కువ మరణాలు సంభవించినట్టు ఆయన చెప్పారు.భారత్ జరిపిన దాడులపై పాకిస్తాన్ ప్రభుత్వం, ప్రజలు ఏమంటున్నారు?భారత్ మిస్సైల్ దాడులపై పాకిస్తాన్ ప్రధాని షాబాజ్ షరీఫ్ స్పందిస్తూ దీనికి బదులు చెప్పే సంపూర్ణ హక్కు పాకిస్తాన్‌కు ఉందన్నారు.ఈమేరకు ఆయన ఎక్స్‌లో ఒక పోస్టు చేశారు.''శత్రువులు పాకిస్తాన్‌లోని ఐదుచోట్ల పిరికిపంద చర్యలకు దిగారు'' అని షాబాజ్ అన్నారు. ఈ చర్యలను 'యుద్ధ చర్యలు'గా ఆయన అభివర్ణించారు.ఈ చర్యలకు దీటైన సమాధానం చెప్పే హక్కు పాకిస్తాన్‌కు ఉందని, ఇందుకు దీటైన సమాధానం ఇస్తామని, పాకిస్తాన్ ప్రజలంతా, పాకిస్తాన్ సైన్యానికి అండగా నిలవాలని షాబాజ్ షరీఫ్ తన పోస్టులో పేర్కొన్నారు.''శత్రువుతో ఎలా వ్యవహరించాలో పాకిస్తాన్‌కు, పాకిస్తాన్ సైన్యానికి తెలుసు. శత్రువు దురుద్దేశాలను ఎట్టి పరిస్థితులలోనూ విజయం సాధించనీయం'' అని పాకిస్తాన్ ప్రధాని పేర్కొన్నారు.''వారు (భారత్) తీవ్రవాదుల స్థావరాలపై దాడులు చేసినట్టు ప్రకటించుకున్నారు. అయితే అంతర్జాతీయ మీడియా సంస్థలు వచ్చి దాడులు జరిగిన ప్రాంతాలు తీవ్రవాదుల స్థావరాలో, సామాన్య ప్రజలు నివసించే ప్రాంతాలో పరిశీలించాలి. రెండు మసీదులపైనా దాడులు జరిగాయి. ఓ చిన్నారి, ఓ మహిళ మృతి చెందారు. ఎంతమంది చనిపోయారనే విషయమై నా వద్ద లెక్కలు లేవు. కానీ దాడులు జరిగిన ప్రాంతాలలో ఏడింటిని గుర్తించాం, రెండు కశ్మీర్‌లోనూ, ఐదు పాకిస్తాన్‌లోనూ ఉన్నాయి. అన్నీ కూడా పౌరులను లక్ష్యంగా చేసుకున్నవే'' అని చెప్పారు.ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్ మాట్లాడుతూ, "నియంత్రణ రేఖ, అంతర్జాతీయ సరిహద్దు వెంబడి భారత సైనిక కార్యకలాపాల గురించి చాలా ఆందోళన చెందుతున్నాను" అన్నారు."రెండు దేశాలు సైనిక సంయమనం పాటించాలి. భారతదేశం, పాకిస్తాన్ మధ్య సైనిక ఘర్షణను ప్రపంచం భరించలేదు" అని పేర్కొన్నారు.పెద్ద పేలుళ్ల శబ్దాలు వినిపించినట్టు పాకిస్తాన్ పాలిత కశ్మీర్‌లోని ముజఫరాబాద్ వాసులు చెప్పారు."మొదటి పేలుడు జరిగినప్పుడు నేను గాఢ నిద్రలో ఉన్నా" అని బిలాల్ మసీదు పక్కనే నివసిస్తున్న మొహమ్మద్ వహీద్ అన్నారు. ఈ మసీదు కూడా దాడికి గురైన ప్రదేశాలలో ఒకటి అని చెబుతున్నారు."నేను వీధిలోకి పరుగెత్తాను, అందరూ వీధుల్లోకి పరుగులు తీశారు. ఏం జరుగుతుందో అర్థమయ్యేలోపే..మరిన్ని క్షిపణలు దూసుకొచ్చాయి. గందరగోళ పరిస్థితి ఏర్పడింది" అని ఆయన చెప్పారు.డజన్ల కొద్దీ ప్రజలు గాయపడ్డారని, వారిని 25 కి.మీ దూరంలో ఉన్న ఆసుపత్రికి తరలించామని వహీద్ చెప్పారు."పిల్లలు ఏడుస్తున్నారు, మహిళలు సెక్యూరిటీ కోసం పరిగెడుతున్నారు. మాకు భయమేసింది, ఏం చేయాలో తెలియదు. ప్రజలు ఇళ్లను వదిలి పారిపోతున్నారు. అంతా గందరగోళం నెలకొంది" అన్నారు వహీద్.భద్రతా దళాలు సంఘటనా స్థలంలో ఉన్నాయని, కానీ మసీదును ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారో తనకు అర్థం కాలేదని ఆయన అన్నారు."ఇది ఒక సాధారణ వీధిలో ఉండే మసీదు. మేం రోజుకు ఐదుసార్లు ప్రార్థనలు చేసేవాళ్ళం. దాని చుట్టూ ఎటువంటి అనుమానాస్పద కార్యకలాపాలను మేం ఎప్పుడూ చూడలేదు" అని వహీద్ అన్నారు.నియంత్రణ రేఖ దగ్గర పేలుళ్ల శబ్దాలు విన్న నివాసితులుఅయితే భారత్ దాడులు ప్రారంభించడానికి ముందు భింబర్గాలి ప్రాంతంలో జమ్మూ కశ్మీర్‌లోకి పాకిస్తాన్ ఫిరంగి కాల్పులు జరిపిందని భారత సైన్యం తెలిపింది.జమ్మూ కశ్మీర్‌లోని అనేక ప్రాంతాలతోపాటు, భింబర్గాలి సమీపంలోని మెంధార్ సహా, కొన్ని ప్రాంతాల్లో పేలుళ్ల శబ్దాలు విన్నట్లు స్థానికులు చెప్పారు."నేను ఉంటున్న చోట, శ్రీనగర్‌లో.. భారీ ఫైటర్ జెట్ కార్యకలాపాలు జరుగుతున్నాయి"అని మా ప్రతినిధి షఫత్ ఫరూక్ తెలిపారు.

# ఏ దేశం దగ్గర ఎన్ని ఆయుధాలున్నాయి

పాకిస్తాన్, పాకిస్తాన్ పాలిత కశ్మీర్ లోని 9 నిర్దేశిత తీవ్రవాద లక్ష్యాలపై భారత్ సైనిక చర్యకు దిగింది. బుధవారం (మే7వ తేదీ) తెల్లవారుజామున జరిగిన ఈ దాడిలో 8మంది చనిపోయినట్టు పాకిస్తాన్ తెలిపింది.మరోపక్క యుద్ధం వంటి అత్యవసర పరిస్థితుల్లో పౌరులు ఎలా స్పందించాలనే విషయంపై సన్నద్ధత కోసం దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు బుధవారం (మే 7న) మాక్ డ్రిల్స్ ను చేపట్టాలని భారత కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది.ఈ నేపథ్యంలో భారత్, పాకిస్తాన్ బలం ఎంత? ఎవరెవరి వద్ద ఎన్నెన్ని ఆయుధాలు ఉన్నాయి, సైనిక సంపత్తి ఎంత, ఎవరెవరు ఎంతెంత సైనిక వ్యయం చేస్తున్నారో తెలుసుకుందాం.'గ్లోబల్ ఫైర్ పవర్' వెబ్‌సైట్ ప్రకారం 2025 మిలటరీ ర్యాంకింగ్‌లలో భారత్.. పాకిస్తాన్ కంటే ముందుంది.2025లో అంతర్జాతీయ సైనిక శక్తికి సంబంధించి 145 దేశాల జాబితాలో భారత్ నాలుగో స్థానంలో ఉంటే పాకిస్తాన్ ర్యాంకు 12.భారత్ దగ్గర దాదాపు 22 లక్షల సైన్యం ఉంది.4,201 యుద్ధ ట్యాంకులు, దాదాపు లక్షా 50 వేల ఆర్మర్డ్ వెహికల్స్, 100 సెల్ఫ్ ప్రొపెల్డ్ ఆర్టిలరీ, 3,975 టోవ్డ్ ఆర్టిలరీ ఉన్నాయి.దీంతో పాటు మల్టీ బారెల్ రాకెట్ ఆర్టిలరీ 264 ఉన్నాయి.భారత వాయుసేన దగ్గర 3 లక్షల10 వేల మంది బలగం ఉంది.2,229 విమానాలున్నాయి. వాటిలో 513 ఫైటర్ విమానాలు కాగా, 270 రవాణా విమానాలు. 130 అటాక్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, 351 శిక్షణ విమానాలు, ఆరు ట్యాంకర్ ఫ్లీట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లున్నాయి.భారత సైన్యానికి చెందిన మూడు విభాగాల దగ్గర 899 హెలికాప్టర్లున్నాయి.వాటిలో 80 అటాక్ హెలికాప్టర్లు.భారత నౌకాదళం దగ్గర లక్షా 42 వేలమంది సెయిలర్లు ఉన్నారు.రెండు విమాన వాహక నౌకలు సహా మొత్తం 293 నౌకలున్నాయి.వాటిలో 13 డిస్ట్రాయర్లు, 14 ఫ్రిగేట్లు, 18 సబ్‌మెరైన్లు, 18 కర్వెట్టీలు ఉన్నాయి.భారత ఆర్మీ పరిధిలో 311 ఎయిర్‌పోర్టులు, 56 పోర్టులు ఉన్నాయి.'గ్లోబల్ ఫైర్ పవర్' ప్రకారం పాకిస్తాన్ సైన్యంలో దాదాపు 13లక్షల11వేలమంది సైనికులు ఉన్నారు. లక్షా 24 వేలమంది నౌకాదళ సిబ్బంది, 78వేల వైమానిక సిబ్బంది ఉన్నారు.పాకిస్తాన్ దగ్గర మొత్తం 1,399 ఎయిర్‌క్రాఫ్ట్‌లున్నాయి. వాటిలో 328 ఫైటర్ జెట్లు, 90 ఎటాక్ టైప్స్, 64 ట్రాన్స్‌పోర్ట్ విమానాలు, 565 ట్రైనర్లు, నాలుగు ట్యాంకర్ ఫ్లీట్లు, 373 హెలికాప్టర్లు ఉన్నాయి. వాటిలో 57 ఎటాక్ హెలికాప్టర్లు.2,627 ట్యాంకులు, 662 సెల్ఫ్ ప్రొపెల్లడ్ ఆర్టిలరీ, 2,629 టోడ్ ఆర్టిలరీ, 600 మల్టీబ్యారల్ ఆర్టిలరీ ఉన్నాయి.పాకిస్తాన్ నౌకాదళం దగ్గర మొత్తం 121 యుద్ధ నౌకలున్నాయి. వాటిలో 9 ఫ్రిగేట్లు, 9 కార్వెట్టులు, 8 సబ్‌మెరైన్లు, 69 పెట్రోల్ నౌకలున్నాయి.పాకిస్తాన్ ఆర్మీ పరిధిలో మూడు పోర్టులు మాత్రమే ఉన్నాయి. దీంతో పాటు 116 ఎయిర్‌పోర్టులు, 60 మర్చంట్ మెరైన్ ఫ్లీట్లు ఉన్నాయి.స్వీడిష్ థింక్ ట్యాంక్ స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎస్ఐపీఆర్ఐ) ప్రకారం భారత్ దగ్గర 172 న్యూక్లియర్ వార్‌హెడ్‌లు ఉండగా, పాకిస్తాన్ దగ్గర 170 ఉన్నాయి.రెండు దేశాలు ఎన్ని అణువార్‌హెడ్‌లను మోహరించాయనేదానిపై స్పష్టత లేదు.భారత్‌తో పోటీపడడానికి పాకిస్తాన్ అణ్వాయుధాలు తయారుచేసుకుంటుంటే, దీర్ఘశ్రేణి లక్ష్యాలను ఛేదించగల ఆయుధాల మోహరింపుపై భారత్ దృష్టి పెట్టిందని ఆ సంస్థ తెలిపింది. ఈ ఆయుధాలు చైనాను కూడా టార్గెట్ చేయగలవు.భారత్, పాకిస్తాన్‌లకు పొరుగు దేశమైన చైనా ప్రపంచంలో మూడో అతిపెద్ద అణ్వాయుధ సంపత్తి ఉన్న దేశం. చైనా దగ్గర అణువార్‌హెడ్‌లు 410 నుంచి 500కు చేరాయి.భారత్, పాకిస్తాన్ డ్రోన్ల సంఖ్యను బాగా పెంచుకుంటున్నాయని గత ఏడాది నవంబరులో బీబీసీ ఉర్దూ ప్రతినిధి షకీల్ అఖ్తర్ రాసిన ఆర్టికల్‌లో పేర్కొన్నారు.వచ్చే రెండు నుంచి నాలుగేళ్లలో డ్రోన్ల సంఖ్యను భారత్ దాదాపు ఐదువేలకు పెంచుకుంటుందని రక్షణరంగ నిపుణులు రాహుల్ బేదీ చెప్పారు.భారత్‌తో పోలిస్తే పాకిస్తాన్ దగ్గర తక్కువ డ్రోన్లు ఉన్నప్పటికీ, పాకిస్తాన్ దగ్గర అనేక రకాల సామర్థ్యమున్న 10 నుంచి 11 రకాల డ్రోన్లు ఉన్నాయి.3.5 బిలియన్ డాలర్ల విలువైన ప్రిడేటర్ డ్రోన్లు కొనుగోలు చేయడానికి గత ఏడాది అక్టోబరులో అమెరికాతో ఒప్పందం కుదుర్చుకుంది భారత్.ప్రిడేటర్ డ్రోన్లను ప్రపంచంలో అత్యంత ప్రమాదకర డ్రోన్లుగా భావిస్తారు.వాటితో పాటు 500 మిలియన్ డాలర్ల విలువైన బాంబులు, లేజర్ గైడెడ్ మిస్సైల్స్ కూడా భారత్ కొనుగోలు చేయనుంది. ఆ డ్రోన్లతో నిర్దేశిత లక్ష్యాలను ఛేదించవచ్చు.తుర్కియే, చైనా నుంచి పాకిస్తాన్ డ్రోన్లు దిగుమతి చేసుకుంటోందని రాహుల్ బేదీ తెలిపారు. జర్మనీ, ఇటలీ నుంచి కూడా పాకస్తాన్ డ్రోన్లు కొనుగోలు చేసింది.బరాఖ్, శహపర్ వంటి డ్రోన్లను కూడా పాకిస్తాన్ తయారుచేస్తోంది.తుర్కియేకు చెందిన అధునాతన బైరాక్తర్ డ్రోన్లు టీబీ2, ఎకెంజీ పాకిస్తాన్ దగ్గర ఉన్నాయి. 'వాంగ్ లాంగ్ 2' సీహెచ్ 4వంటి డ్రోన్లను కూడా చైనా నుంచి పాకిస్తాన్ కొనుగోలు చేసింది.

# జైషే మహమ్మద్ స్థావరాలు ధ్వంసం

- పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్న భారత్..
- ఆపరేషన్ సింధూర్ పేరుతో ఇండియా వైమానిక దాడులు..
- జైషే మహమ్మద్ స్థావరాలను ధ్వంసం చేసిన భారత సైన్యం..



**ఢిల్లీ :** పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. పాకిస్తాన్ కు ఇండియన్ ఆర్మీ ధీటైన సమాధానం ఇచ్చింది. ఇక, పాక్ లోని ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా 'ఆపరేషన్ సింధూర్' పేరిట వైమానిక దాడులు చేసింది భారత రక్షణ శాఖ. ఈ దాడులు పాకిస్తాన్ తో పాటు పీఓకేలోని తొమ్మిది ఉగ్ర స్థావరాలను గుర్తించి నాశనం చేసినట్టు ఇండియన్ ఆర్మీ పేర్కొంది.కాగా, భారత్ సైన్యం చేసిన దాడిలో 4 జైషే మహమ్మద్ స్థావరాలు ధ్వంసం అయ్యాయి. పాకిస్తాన్ లోని బహవల్పూర్ లోని మర్కజ్ సుభాన్ అల్లా ప్రాంతంలో ఈ హెడ్ క్వార్టర్ ఉంది. సుమారు, 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ శిబిరం నుంచే 2019లో పుల్వామా దాడికి ఉగ్రవాదులు ఇక్కడే శిక్షణ పొందారు. అలాగే, మసూద్ అజార్ ఆధీనంలోని ఈ టెర్రర్ క్యాంప్ ను టార్గెట్ చేసి మరి ధ్వంసం చేసింది భారత ఆర్మీ. ఇక, జైష్ చీఫ్ మౌలానా మసూద్ అజార్, ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ అస్గర్ తో కలిసి ఈ శిబిరం నుంచే ఉగ్ర కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు.అయితే, మసూద్ అజార్ ఉండే ప్రదేశాలే లక్ష్యంగా భారత ఆర్మీ మిస్సైల్ దాడులకు దిగింది. బహావల్ పూర్ లోని ఉగ్ర స్థావరంపై మొదటి దాడి చేసిన ఇండియా.. 30 మంది టెర్రరిస్టులను మట్టుబెట్టింది. లష్కరే తోయిబా ఉగ్రవాద స్థావరాలపైనా క్షిపణులతో దాడులకు దిగింది. భారత్ మిస్సైల్ దాడులతో పాకిస్తాన్ బెంబేలెత్తి పోయింది. 6 చోట్ల దాడి చేసి 24 క్షిపణులను భారత్ ప్రయోగించిందని పాక్ ఆరోపించింది. ఈ దాడుల్లో సుమారు 8 మంది పాకిస్తాన్ ప్రజలు మృతి చెందగా 33 మందికి గాయపడినట్లు పాక్ ఆర్మీ అధికారి తెలిపారు.

# ఆపరేషన్ సింధూర్ ఎఫెక్ట్.. 18 ఎయిర్‌పోర్టులు మూసివేత

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు చేపట్టిన ''పహల్గామ్ ఉగ్రదాడి''కి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. బుధవారం తెల్లవారుజామున పాకిస్తాన్ వ్యాప్తంగా 9 ఉగ్రవాద స్థావరాలపై భారత్ త్రివిధ దళాల నేతృత్వంలో ''ఆపరేషన్ సింధూర్'' పేరుతో దాడులు జరిగాయి. ఈ దాడుల్లో ఉగ్రస్థావరాలను భారత సైన్యం నెలమట్టం చేసింది. ఈ దాడుల్లో 80 వరకు ఉగ్రవాదుల మరణించినట్లుగా తెలుస్తోంది. నిజమైన సంఖ్య దీని కన్నా ఎక్కువగా ఉంటుందని సమాచారం. లష్కరే తోయిబా, జైషే మహ్మద్ ఉగ్రస్థావరాలు నామరూపాలు లేకుండా నాశనమయ్యాయి.ఇదిలా ఉంటే, ఆపరేషన్ సింధూర్ ఎఫెక్ట్ దేశీయ విమానాలపై పడింది. ఎయిర్ ఇండియా, ఇండిగో, స్పైజ్ జెట్ వంటి విమానయాన సంస్థలు పాకిస్తాన్ సరిహద్దు



రాష్ట్రాల్లోని నగరాలు, పట్టణాల్లోని విమానాశ్రయాలకు విమాన సర్వీసుల్ని రద్దు చేసింది. మొత్తం 18 ఎయిర్‌పోర్టులు మూసేశారు. దాదాపుగా 200 విమానాలు రద్దు చేశారు. శ్రీనగర్, లేహ్, అమృత్‌సర్, చండీగఢ్ ఎయిర్ పోర్టులు మూతపడ్డాయి. వీటితో పాటు పఠాన్ కోట్, జోధ్‌పూర్, జైసల్మేర్, సిమ్లా, ధర్మశాల, జామ్‌నగర్ సహా ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లోని విమాన కార్యకలాపాలు నిలిపేశారు. ఇండిగో ఒక్కటే దాదాపుగా 165 సర్వీసుల్ని రద్దు చేసింది.

# కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్

- బీజాపూర్- బీజాపూర్ లోని కర్రెగుట్ట కొండలో రెండు వారాలుగా ఆపరేషన్
- బీజాపూర్ జిల్లా ఊసూర్ బ్లాక్ కర్రె గుట్టలపై ఎన్ కౌంటర్
- భద్రతా బలగాల ఎదురు కాల్పుల్లో 22 మంది మావోయిస్టులు మృతి



**భద్రాచలం,ఫ్లాష్ ఇండియా :** బీజాపూర్ జిల్లా, ఊసూర్ బ్లాక్ పరిధిలోని కర్రెగుట్ట కొండలలో కేంద్ర బలగాలు గత రెండు వారాలుగా విస్తృతంగా ఆపరేషన్ ను కొనసాగిస్తున్నాయి. 'ఆపరేషన్ కగార్'గా కొనసాగుతున్న ఈ ప్రత్యేక చర్యల్లో కేంద్ర బలగాలు, ముఖ్యంగా CRPF యూనిట్లు, ఛత్తీస్ గఢ్-తెలంగాణ సరిహద్దులోని గుట్టల మధ్య లోతైన అటవీ ప్రాంతాల్లో కూంబింగ్ చేస్తున్నారు. ఈ ఆపరేషన్ ముఖ్య ఉద్దేశ్యం.. దేశవ్యాప్తంగా రెడ్ అలర్ట్ ఉన్న నక్సలైట్ నేతలు, ముఖ్యంగా హిద్మా వంటి అగ్రశ్రేణి మావోయిస్టులను పట్టుకోవడం. భద్రతా వర్గాల సమాచారం ప్రకారం, ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున మావోయిస్టుల ఉనికి ఉందన్న బలమైన సమాచారం మేరకు ముందుచూపుతో ఆపరేషన్ సాగుతోంది.ఈ నేపథ్యంలో కర్రెగుట్టల్లో జరిగిన ఎన్ కౌంటర్ లో 22 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఘటనా స్థలంలో భద్రతా బలగాలు భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నాయి. CRPF ఐజీ రాకేష్ అగర్వాల్, బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ పీ ఎన్కౌంటర్ ను అధికారికంగా ధృవీకరించారు. ఇక ఓ మహిళా మావోయిస్టు మృతి చెందిన ఘటనలో అధికారులు 303 రైఫిల్ ను స్వాధీనం చేసుకున్నారు.భద్రతా బలగాలు కర్రెగుట్టల గుట్టలపై ఆధిపత్యాన్ని సాధించాయి. ధోబే కొండలు, నీలం సరాయి ప్రాంతాల్లో ఫార్వర్డ్ బేస్ క్యాంపులు ఏర్పాటు చేయగా, అలుబాక శివారులో మరో క్యాంపును ఏర్పాటు చేస్తున్నారు. ఆధునిక సాంకేతికతతో డ్రోన్లు, సిగ్నలింగ్ టవర్లు ద్వారా మావోయిస్టుల కదలికలను గుర్తించేందుకు చర్యలు చేపట్టారు. K9, K3 డాగ్ స్క్వాడ్ బృందాలు భూగర్భ బంకర్ల వేట కొనసాగిస్తున్నాయి. వందల సంఖ్యలో మావోయిస్టులు ఈ ప్రాంతాల్లో బంకర్లు నిర్మించినట్లుగా సమాచారం అందడంతో, భద్రతా బలగాలు ప్రతి ఇంచు ఇంచుగా గాలిస్తున్నారు. మందుపాతరలు, IED బాంబులపై ప్రత్యేక నిఘా పెట్టి, ముందస్తు అపాయాన్ని నివారించేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

# ఇండియాకు ఇజ్రాయెల్ బాసట

- పాకిస్తాన్ పై దాడులకు దిగిన భారత్.. ఇండియాకు బాసటగా నిలిచిన ఇజ్రాయెల్..
- ఉగ్రవాదంపై విధంగానే ముందుకు వెళ్లండని సూచన..



**ఢిల్లీ :** పాకిస్తాన్ పై దాడులు తప్పవని భారత ప్రభుత్వం గత కొన్ని రోజులుగా చెబుతునే వస్తుంది. అన్నట్లుగానే మంగళవారం అర్ధరాత్రి పాకిస్తాన్ లోని ఉగ్ర స్థావరాలపై ఇండియన్ ఆర్మీ దాడులకు దిగింది. మొత్తం 9 ఉగ్ర స్థావరాలను లక్ష్యంగా చేసుకుని విజయవంతంగా ధ్వంసం చేసింది.ఇక, పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే) లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం దాడులకు ఇజ్రాయెల్ బాసటగా నిలిచింది. ఉగ్రవాదంపై పోరాటంలో భారతదేశానికి మద్దతుగా ఉంటామని హామీ ఇచ్చారు. ఉగ్రవాదులను నాశనం చేసేందుకు భారత్ ఇలాగే దాడులు కొనసాగించాలని ఢిల్లీలోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ ఎక్స్ వేదిగా పోస్ట్ చేశారు. ఇండియా ఆత్మరక్షణ కోసమే ఈ దాడులు చేసింది.. వారికి మేము అండగా ఉంటామని పేర్కొన్నారు. అమాయకులపై టూరిస్టులపై ఉగ్రదాడికి పాల్పడిన పాకిస్తాన్ కి తగిన బుద్ధి చెప్పాలని ఇజ్రాయెల్ రాయబారి సూచించారు.మరోవైపు, టర్కీ పాకిస్తాన్ కు సంఘీభావం తెలిపింది. పాక్ లో క్షీణిస్తున్న ప్రాంతీయ భద్రతా పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా టర్కీ విదేశాంగ మంత్రి హకన్ ఫిదాన్ సైతం పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ కు ఫోన్ చేసి తాజా పరిణామాలపై చర్చించారు. భారత దళాలు చేసిన దాడిని వివరించినట్లు తెలుస్తుంది. కాగా, మారుతున్న పరిస్థితిపై సన్నిహిత సమన్వయంతో ఉండటానికి ఇరువురు నాయకులు అంగీకరించారు.

# శాంతించండి

- జమ్మూకశ్మీర్ పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారం
- ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలపై భారత ఆర్మీ విరుచుకుపడింది
- అయితే ఈ ఆపరేషన్‌సపై చైనా స్పందించింది.





**ఢిల్లీ :** జమ్మూకశ్మీర్ పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్ లోని ఉగ్రస్థావరాలపై భారత ఆర్మీ విరుచుకుపడింది. అయితే ఈ ఆపరేషన్ సపై చైనా స్పందించింది. భారత్ , పాక్ మధ్య నెలకొన్న ప్రస్తుత పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. రెండు దేశాలూ సంయమనం పాటించాలని కోరింది.పాకిస్తాన్ కు సన్నిహిత మిత్రదేశమైన చైనా భారత్ తోనూ సరిహద్దులు పంచుకుంటున్న విషయం తెలిసిందే. అయితే బుధవారం వేకువజామున భారత ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ పై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఒక ప్రకటన విడుదల చేశారు. ఉగ్రవాదాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొంది. భారత్, పాకిస్తాన్ రెండూ శాంతి, స్థిరత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సంయమనం పాటించాలని సూచించారు. పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసే చర్యలను తీసుకోకుండా ఉండాలని తాము కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు ఆపరేషన్ సింధూర్ పై భారత ఆర్మీ వీడియో విడుదల చేసింది. చెప్పిందే చేశాం.. అని ప్రస్తావిస్తూ వీడియోను షేర్ చేసింది.

# బిజినెస్

## బీఎస్ఎన్ఎల్ స్పెషల్ ఆఫర్

**న్యూఢిల్లీ:** భారత సంచార్ నిగమ్ లిమిటెడ్ (BSNL) 'మదర్స్ డే' సందర్భంగా వినియోగదారుల కోసం ప్రత్యేక ఆఫర్ ను ప్రవేశపెట్టింది. మే 7 నుండి మే 14 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. ఈ ఏడాది మదర్స్ డే మే 11, ఆదివారం నాడు వస్తోంది. ఈ సందర్భంగా BSNL మూడు లాంగ్ వాలిడిటీ ప్లాన్లపై 5 శాతం డిస్కౌంట్ అందిస్తోంది. ఈ




ఆఫర్ ను BSNL తన అధికారిక X (ట్విట్టర్) ఖాతా ద్వారా ప్రకటించింది. రూ.2399, రూ.997, రూ.599 ప్లాన్లపై ఈ డిస్కౌంట్ వర్తిస్తుంది. వినియోగదారులు BSNL వెబ్ సైట్ లేదా సెల్ఫ్ కేర్ యాప్ ద్వారా రీచార్జ్ చేస్తేనే ఈ తగ్గింపు ధరలు వర్తిస్తాయి.ఇందులో భాగంగా రూ.2399 ప్లాన్ ఇప్పుడు రూ.2279కి, రూ.997 ప్లాన్ ఇప్పుడు రూ.947కి, రూ.599 ప్లాన్ ఇప్పుడు రూ.569కి డిస్కౌంట్ తర్వాత ప్లాన్ ధరలు ఉండనున్నాయి. దీంతో వినియోగదారులు మొత్తం రూ.120 వరకు ఆదా చేసుకునే అవకాశం ఉంది.

**రూ.2399 ప్లాన్ వివరాలు:**

ఈ ప్లాన్ కు 395 రోజుల వ్యాలిడిటీ ఉంటుంది. వినియోగదారులకు ఇండియావ్యాప్తంగా అన్లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 2GB హై-స్పీడ్ డేటా, ప్రతి రోజు 100 ఉచిత SMS లభిస్తాయి. అంతేకాకుండా, BiTV యాక్సెస్ ఉచితంగా లభిస్తుంది. దీని ద్వారా 350కి పైగా లైవ్ టీవీ ఛానళ్లను మొబైల్ లో వీక్షించవచ్చు.

**రూ.997 ప్లాన్ వివరాలు:**

160 రోజుల వ్యాలిడిటీ కలిగిన ఈ ప్లాన్ లో కూడా అన్లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 2GB డేటా, 100 ఉచిత SMS లభిస్తాయి. BiTV యాక్సెస్ కూడా ఉచితంగానే లభిస్తుంది.

**రూ.599 ప్లాన్ వివరాలు:**

ఈ ప్లాన్ కు 84 రోజుల వ్యాలిడిటీ ఉంటుంది. ఇందులో రోజుకు 3GB హై-స్పీడ్ డేటా, అన్లిమిటెడ్ కాల్స్, 100 ఉచిత SMS లభిస్తాయి. BiTV యాక్సెస్ ఉచితంగా ఉంటుంది. మొత్తం మీద, ఈ మదర్స్ డే సందర్భంగా BSNL ఇచ్చే ఈ ప్రత్యేక ఆఫర్ ను వినియోగదారులు వినియోగించుకుని తక్కువ ధరలో లాంగ్ వాలిడిటీతో కూడిన సేవలను పొందవచ్చు.


# ఆపరేషన్ సింధూర్ ఎఫెక్ట్

- ఆపరేషన్ సింధూర్ ఎఫెక్ట్..
- కుప్పకూలిన పాక్ స్టాక్ మార్కెట్లు..
- భారీగా క్షీణించిన పాక్ స్టాక్ మార్కెట్ ఇండెక్స్ కరాచీ..
- దాదాపు 6 శాతం మేర నష్టపోయిన పాకిస్తాన్ స్టాక్ మార్కెట్లు..



**ఢిల్లీ :** పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ లోని తొమ్మిది ఉగ్రవాదుల స్థావరాలపై 'ఆపరేషన్ సింధూర్' పేరుతో భారత సైన్యం దాడులు చేసింది. ఈ దాడుల్లో సుమారు 80 మందికి పైగా చనిపోయినట్లు తెలుస్తుంది. అయితే, ఆపరేషన్ సింధూర్ ఎఫెక్ట్ తో పాకిస్తాన్ స్టాక్ మార్కెట్ కు బిగ్ షాక్ తగిలింది. పాక్ స్టాక్ మార్కెట్ ఇండెక్స్ కరాచీ-100 బుధవారం తెల్లవారుజామున ప్రారంభ ట్రేడింగ్ లో 6,272 పాయింట్లు ( 6 శాతం) మేర నష్టపోయింది. అయితే, మంగళవారం ముగింపు స్థాయి 113,568.51 నుంచి 107,296.64 కనిష్ట స్థాయికి పడిపోయింది. పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత KSE-100 సూచీ 3.7 శాతం క్షీణించగా, దేశీయ సెన్సెక్స్ సూచీ దాదాపు 1.5 శాతం పెరిగింది.అయితే, ఏప్రిల్ 22వ తేదీన జమ్మూ & కాశ్మీర్ లో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత పాకిస్తాన్ స్టాక్ మార్కెట్ యొక్క KSE-100 సూచిక సుమారు 4 శాతం మేర క్షీణించింది. ఉగ్రవాద దాడి తర్వాత భారత్- పాకిస్తాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలతో పాకిస్తాన్ స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తున్నాయి. మరోవైపు, భారత స్టాక్ మార్కెట్ ఫ్లాట్ గా ప్రారంభమయ్యాయి. భారత్ -పాక్ ల మధ్య భగ్గుమంటోన్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయంగా మార్కెట్లలో నెలకొన్న మిశ్రమ సంకేతాలతో.. తొలుత స్వల్ప నష్టాల్లో ప్రారంభమైన మార్కెట్లు తర్వాత లాభాల్లోకి వచ్చాయి. భారత స్టాక్ మార్కెట్లు ఉదయం 10 గంటల నాటికి, సెన్సెక్స్ కేవలం 32 పాయింట్లు ఉండగా.. నిఫ్టీ 50 పాయింట్లకు చేరుకుంది.

# ఏమాత్రం జంకని భారత స్టాక్ మార్కెట్లు



**న్యూఢిల్లీ:** భారత స్టాక్ మార్కెట్ల దమ్మెంతో ప్రపంచానికి తెలిసొస్తోంది. ఆఖరికి పాకిస్థాన్ తో యుద్ధం మొదలుపెట్టినప్పటికీ కూడా ఇండియా మార్కెట్లు ఏ మాత్రం జంకలేకుండా తమ దమ్మెంతో చూపించాయి. అటు, ట్రంప్ టారిఫ్స్ పెడితే, యావత్ ప్రపంచం ఒణికిపోతే, ఇండియా మాత్రం ఏ మాత్రం తొణకలేదు. ఇదే ఊపుని చివరికి యుద్ధం సమయంలోనూ చూపించాయి. ఇవాళ (బుధవారం) సెన్సెక్స్ 105.71 పాయింట్లు లాభపడి, 80,746.78 దగ్గర ఉంటే, నిఫ్టీ 34.80 పాయింట్లు పెరిగి 24,414.40 దగ్గర క్లోజ్ అయింది.నిఫ్టీలో టాటా మోటార్స్, బజాజ్ ఫైనాన్స్, జియో ఫైనాన్షియల్, శ్రీరామ్ ఫైనాన్స్, కోల్ ఇండియా ప్రధాన లాభాలను ఆర్జించగా, ఆసియన్ పెయింట్స్, సన్ ఫార్మా, బజాజ్ ఆటో, హెచ్ సిఎల్ టెక్నాలజీస్, ఐటిసి నష్టపోయాయి. బిఎస్ ఇ మిడ్ క్యాప్ ఇండెక్స్ 1 శాతం పెరిగింది. స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం పెరిగింది. ఎఫ్ ఎంసిజి, ఫార్మా మినహా అన్ని రంగాలలో మిగతా సూచీలు గ్రీన్ లో ముగిశాయి.

# ఐదేళ్లలో రూ 8.5 లక్షల కోట్ల వాణిజ్యం

- పెట్టుబడులు, జీడీపీ వృద్ధికి ఊతం
- భారత్-యూకే వాణిజ్య ఒప్పందంపై ఇండియా ఇంక్



**లండన్ :** భారత-బ్రిటన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్ టీఏ)పై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ఈ ఎఫ్ టీఏతో యూకే మార్కెట్లో భారతీయ ఎగుమతిదారులకు మరింత లబ్ది చేకూరనుందని పారిశ్రామిక సంఘా లు తెలిపాయి. ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత వాతావరణంలో ఈ ఎఫ్ టీఏతో ఎఫ్ ఎంసీజీ, హెల్త్ కేర్ , ఇన్నోవేషన్ ఆధారిత పరిశ్రమలకు లాభం చేకూరనుందని ఫిక్కీ ప్రెసిడెంట్ హర్ష వర్ధన్ అగర్వాల్ అన్నారు. అంతేకాకుండా 2030 నాటికి భారత్ -యూకే ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 10,000 కోట్ల డాలర్ల (రూ.8.5 లక్షల కోట్లు)కు చేర్చే అవకాశం లభించనుందని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) జాతీయ అధ్యక్షుడు సంజీవ్ పురి ఆశాభావం వ్యక్తం చేశారు. సుంకాల యుద్ధం నేపథ్యంలో రెండు దేశాల మధ్య కుదిరిన ఈ ఎఫ్ టీఏ మరింత ప్రాధాన్యత సంతరించుకుందని సీఐఐ యూకే-ఇండియా బిజినెస్ ఫోరం చైర్మన్ కేశవ్ మురుగేశ్ అన్నారు. ఈ ఒప్పందంతో రెండు దేశాల మధ్య వాణిజ్య, పెట్టుబడులకు ఉన్న ఆటంకాలూ తొలగిపోతాయని యూకే-ఇండియా బిజినెస్ కౌన్సిల్ (యూకేఐబీసీ) పేర్కొంది. ఈ ఎఫ్ టీఏ రెండు దేశాల ఆర్థిక వృద్ధితో పాటు ఉద్యోగాలు, నవకల్పనలకూ దోహదం చేస్తుందని యూకేఐబీసీ చైర్మన్ రిచర్డ్ హీల్డ్ చెప్పారు.'ఈయూ నుంచి బయటికి వచ్చిన తర్వాత బ్రిటన్ కుదుర్చుకున్న అతిపెద్ద ఎఫ్ టీఏ ఇదే. భారత్ ప్రస్తుతం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. బ్రిటన్ కు 11వ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. వచ్చే ఐదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యం 8,000 కోట్ల పౌండ్లకుపైగా పెరిగేందుకు ఈ ఎఫ్ టీఏ ప్రేరకం కానుంది' అని ఇంటర్నేషనల్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) యూకే చాప్టర్ చైర్మన్ లార్డ్ కరన్ బిలీమోరియా చెప్పారు.మరోవైపు ఈ ఒప్పందాన్ని నాస్కామ్ కూడా స్వాగతించింది. భారత టెక్నాలజీ కంపెనీలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న డబుల్ కంట్రిబ్యూషన్ భారం వంటివి తొలగిపోనున్నాయని, ఇది ఈ రంగానికి ఎంతగానో మేలు చేకూర్చనుందని పేర్కొంది. ఏఐ, సైబర్ సెక్యూరిటీ వంటి ఎమర్జింగ్ రంగాల్లో మరిన్ని ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఎఫ్ టీఏతో లభించనుందని నాస్కామ్ వెల్లడించింది.

# ఇంకా నగదే రారాజు

**న్యూఢిల్లీ:** డిజిటల్ చెల్లింపులు ఎంతగా పుంజుకున్నా మన దేశ ఆర్థిక వ్యవస్థలో ఇంకా నగదు హవా కొనసాగుతోంది. గత పదేళ్లలో, చలామణిలో ఉన్న కరెన్సీ నోట్ల (నగదు) పరిమాణం 157 శాతం, ఏటీఎంల సంఖ్య 32 శాతం, బ్యాంకు శాఖల సంఖ్య 36 శాతం పెరగడం ఇందుకు ఉదాహరణ. బ్యాంకు లు, ఆర్థిక సంస్థలకు నగదు నిర్వహణ సేవలు అందించే సీఎంఎస్ ఇన్ఫో సిస్టమ్స్ ఒక నివేదికలో ఈ విషయాలు వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో దేశంలోని ఒక్కో ఏటీఎం నుంచి సగటున రూ.1.3 కోట్ల నగదు ఉపసంహరణలు (విత్ డ్రాయల్స్ ) నమోదయ్యాయి. 2016-17 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది రూ.28 లక్షలు ఎక్కువ. గత ఏడాది మార్చి నాటికి చూసినా మన దేశ వినియోగదారుల చెల్లింపుల లావాదేవీల్లో 60 శాతం నగదు ద్వారానే జరిగాయి.

**దక్షిణాదిలో కనిష్ఠం**

దక్షిణ భారత్ తో పోలిస్తే ఉత్తర భారత్ లో నగదు హవా మరింత ఎక్కువగా ఉంది. నిజానికి దక్షిణ భారత్ లో గత ఆర్థిక సంవత్సరం (2024-25) ఏటీఎంల నుంచి విత్ డ్రా చేసే నగదు పరిమాణం వృద్ధి రేటు తగ్గింది. తమిళనాడు, తెలంగాణల్లో జీరో వృద్ధి రేటు నమోదు కాగా, ఆంధ్రప్రదేశ్ లో మైనస్ ఒక శాతం, కేరళలో మైనస్ 14 శాతం, కర్ణాటకలో మైనస్ రెం డు శాతం నమోదైంది. ఇదే సమయంలో బిహార్ లో 8 శాతం, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ ల్లో 4 శాతం, ఛత్తీస్‌గఢ్ , హిమాచల్ ప్రదేశ్ ల్లో 2 నుంచి 3 శాతం నగదు విత్ డ్రాయల్స్ పెరిగినట్టు సీఎంఎస్ ఇన్ఫో నివేదిక వెల్లడించింది.

**సగటు విత్ డ్రాయల్స్ రూ.5,658**

గత ఆర్థిక సంవత్సరం ఒక్కో వ్యక్తి ఏటీఎం నుంచి విత్ డ్రా చేసిన సగటు నగదు మొత్తం రూ.5,658కు చేరింది. అంతకు ముందు సంవత్సరం (2023-24)తో పోలిస్తే ఇది 3 శాతం ఎక్కువ. గత ఏడాది అక్టోబరు నుంచి ఈ సంవత్సరం మార్చి వరకు చూస్తే కొన్ని నెలల్లో నగదు ఉపసంహరణలు 4 నుంచి 6 శాతం పెరిగాయి. ఇదే సమయం లో సగటు డిజిటల్ చెల్లింపులు తగ్గాయి. 2023 ప్రథమార్ధంలో రూ.1,603గా ఉన్న యూపీఐ చెల్లింపుల సగటు.. గత ఏడాది తొలి ఆరు నెలల్లో రూ.1,478కు తగ్గింది. ఇదే సమయంలో పర్సన్ -2-మర్చంట్ (పీ2ఎం) చెల్లింపులూ రూ.667 నుంచి రూ.643కు తగ్గినట్టు సీఎంఎస్ నివేదిక తెలిపింది.

# ఉలిక్కపడ్డ పాతబస్తీ

## చంద్రయాణగుట్ట హైడ్రా కూల్చివేతలు

- అక్రమ నిర్మాణాలపై హైడ్రా కొరడా
- MIM నేతల నిరసన, మహిళల అరెస్ట్
- ప్రభుత్వ భూములకు హైడ్రా భద్రత



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ పాతబస్తీలోని చంద్రయాణగుట్ట నియోజకవర్గం, బండ్లగూడ మండలం పరిధిలో హైడ్రా విభాగం అక్రమ కబ్జాదారులపై విరుచుకు పడింది. అక్బర్ నగర్ ప్రాంతంలోని సర్వే నంబర్లు 303 నుంచి 306 వరకూ ఉన్న ప్రభుత్వ భూమిలో 2000 గజాల మేర కబ్జా చేసిన స్థలాన్ని గుర్తించిన హైడ్రా బృందం, అక్కడ అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను కూల్చివేసింది. ఇటీవల కాలంగా చెరువులు, ప్రభుత్వ భూములపై జరిగుతున్న అక్రమ నిర్మాణాలపై హైడ్రా తీవ్రంగా ఫోకస్ చేస్తోంది. ఈ చర్యలతో కబ్జా రాయుల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. అయితే ఈ కూల్చివేతలకు వ్యతిరేకంగా పలువురు MIM కార్పొరేటర్లు, మహిళా నాయకులు హైడ్రా అధికారులపై నిరసన చేపట్టారు."హైడ్రా రంగరాజన్ డౌన్ డౌన్" అంటూ నినాదాలు చేశారు. కొందరు హైడ్రా కమిషనర్ పై డబ్బులు తీసుకోకుండా కూల్చివేశారని ఆరోపించారు. ఈ క్రమంలో నిరసన వ్యక్తం చేసిన పలువురు MIM నేతలు, మహిళా నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైడ్రా దాడుల సమయంలో అక్కడ భారీగా పోలీసు బలగాలు మోహరించాయి. ఇందులో భాగంగా, ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు లేదా చెరువుల్లో చేపట్టిన నిర్మాణాలపై ఎవరైనా సమాచారమిస్తే, వాటిపై వెంటనే చర్యలు తీసుకుంటామని హైడ్రా అధికారుల వర్గాలు స్పష్టం చేశాయి.

# హైదరాబాద్‌కు చేరుకున్న 51 దేశాల అందగత్తెలు

- ప్రతిష్టాత్మకమైన మిస్ వరల్డ్ పోటీలకు హోస్టింగ్ చేస్తున్న తెలంగాణ
- ఇప్పటికే నగరానికి చేరుకున్న 51 దేశాలకు చెందిన అందగత్తెలు
- ఈ వేడుకల్లో పాల్గొనేందుకు ఎయిర్ పోర్టుకు చేరుకుంటున్న వివిధ దేశాల కంటెస్టెంట్లు



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ప్రతిష్టాత్మకమైన మిస్ వరల్డ్ పోటీలకు హోస్టింగ్ చేసే అరుదైన గౌరవాన్ని పొందిన హైదరాబాద్ ఇప్పుడు అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తోంది. ఇప్పటికే 51 దేశాలకు చెందిన అందాల ప్రదినిధులు నగరానికి చేరుకున్నారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల కంటెస్టెంట్లు ఎయిర్ పోర్టులో అడుగుపెడుతున్న నేపథ్యంలో శంషాబాద్ విమానాశ్రయం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. వచ్చిన ప్రతి కంటెస్టెంట్ కు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ఆధారంగా సాంప్రదాయ వస్త్రధారణతో, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలుకుతోంది. ఆతిథ్య పరంగా రాష్ట్రం తన విస్తృతతను చాటుతోంది.అధికార యంత్రాంగం, సంఘటిత సిబ్బంది రోజూ 24 గంటలూ పనిచేస్తూ వచ్చిన అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తున్నారు. ఎయిర్ పోర్ట్ నుంచీ వసతి కేంద్రాల వరకు వాహనాల ఏర్పాటు, భద్రతా చర్యలు, ఆతిథ్య సేవలు అన్నింటినీ అధిక శ్రద్ధతో పర్యవేక్షిస్తున్నారు. ఇంకా మరిన్ని దేశాల నుంచి అందాల రారాణులు హైదరాబాద్ కు చేరుకునే అవకాశం ఉండటంతో నగరంలో పండుగ వాతావరణం నెలకొంది. మిస్ వరల్డ్ ఈవెంట్ ను విజయవంతంగా నిర్వహించి, హైదరాబాద్ ను ప్రపంచ దృష్టికి తీసుకెళ్లే లక్ష్యంతో అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

# జీవితాలను నాశనం చేసుకోవద్దు




**ఆర్మూర్ ,ఫ్లాష్ ఇండియా :** యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని, యువత తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు సన్మార్గంలో నడిచి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆర్మూర్ ఎసిపి వెంకటేశ్వర రెడ్డి, యాంటీ నార్కొటిక్ బ్యూరో ఎసీపీ పుష్యన్ కుమార్ లు అన్నారు. నిజామాబాద్ సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు ఆర్మూర్ పీఎస్ పరిధిలో గల ఆర్మూర్ మండలంలోని చేపూర్ గ్రామంలో తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో వారి ఆధ్వర్యంలో గంజాయి, కల్తీకల్లు, మత్తు పదార్థాల పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి, యాంటీ నార్కొటిక్ బ్యూరో ఏసీపీ పుష్యన్ కుమార్ లు హాజరై మాట్లాడారు. అంతకుముందు గ్రామంలో యువత మత్తుపదార్థాలైన గంజాయి, కల్తీకల్లు ఇతర పదార్థాల జోలికి వెళ్ళవద్దని ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.మత్తు పదార్థాలకు అలవాటైన యువతకు ఏమీ తోచదని మత్తు తప్ప ఇతర ఏ పనులు కనిపించవని సూచించారు. తల్లిదండ్రులు విద్యావంతులైన గురువులు సూచించిన ప్రకారం మంచి ప్రవర్తనతో మంచి లక్ష్యాలను నిర్దేశించుకుని యువత భవిష్యత్తును బంగారు మయం చేసుకునేందుకు మత్తు పదార్థాల జోలికి వెళ్ళవద్దన్నారు. గ్రామాల్లో గంజాయి, కల్తీకల్లుల సమాచారం తెలిస్తే ప్రజలు మాకు సమాచారం అందించాలని వాటి పై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఎక్సైజ్ సీఐ రంజిత్ రావు, ఆర్మూర్ సీఐ సత్యనారాయణ గౌడ్, ఆర్మూర్ ఎస్సై రమేష్ , మెడికల్ ఆఫీసర్ కీర్తన, చేపూర్ వీడీసీ చైర్మన్ శ్రీకాంత్, పంచాయతీ సెక్రటరీ హరికృష్ణ, గ్రామ ప్రజలు, యువకులు, ఆశా వర్కర్లు, మహిళా సంఘాలు ప్రతినిధులు, ఇతర పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కుమారుడి పెళ్లి ఆగిందని తండ్రి ఆత్మహత్య

**నారాయణపేట,ఫ్లాష్ ఇండియా :** తల్లిదండ్రులు తమ పిల్లలు ఎదిగాక వారికి పెళ్లిళ్లు చేసి ఓ ఇంటి వాళ్లను చేయాలని భావిస్తుంటారు. తమ బాధ్యతగా కొడుకులు, కూతుర్లకు వివాహాలు జరిపిస్తుంటారు. ఇదే విధంగా ఓ తండ్రి తన కుమారుడి పెళ్లిని ఘనంగా చేయాలనుకున్నాడు. తగిన వధువును చూసి పెళ్లి జరిపించాలని కలలు కన్నాడు. కానీ, అతని కల కలగానే మిగిలిపోయింది. మరో రెండు రోజుల్లో పెళ్లి జరగాల్సి ఉండగా వధువు ప్రియుడితో వెళ్లిపోయింది. దీంతో కుమారుడి పెళ్లి ఆగిపోయింది. అవమాన భారంగా భావించిన తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషాద ఘటన నారాయణ పేట జిల్లాలో చోటు చేసుకుంది.గోవిందరావు ( 54) తన కొడుకు అభిషేక్ కు బంధువుల అమ్మాయి శ్వేతతో పెళ్లి కుదుర్చుకున్నారు. ఇటీవల హంగు ఆర్భాటాలతో నిశ్చితార్థం జరిపించారు. ఇరు కుటుంబాలు ఎంతో సంతోషించాయి. పెళ్లి ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు. ఈ నెల 9న వివాహం జరగాల్సి ఉంది. మిత్రులు, శ్రేయోభిలాషులు, బంధువులకు పెళ్లి పత్రికలు పంచాడు గోవిందరావు. పెళ్లి పనులన్నీ పూర్తయ్యాయి. ఇక జరగాల్సింది వివాహమే. ఇంతలోనే వధువు శ్వేత ఊహించని షాకిచ్చింది.ఈ పెళ్లి ఇష్టం లేని శ్వేత తన ప్రియుడితో వెళ్లిపోయింది. శ్వేత చేసిన ఈ పనికి ఇరు కుటుంబాల్లో ఉద్విగ్న వాతావరణం నెలకొంది. తమ కుటుంబం పరువు పోయిందని భావించిన వరుడు తండ్రి గోవింద రావు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గోవింద రావు మృతితో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పెళ్లి డప్పులు మోగాల్సిన ఇంట్లో చావు డప్పులు మోగడంతో ప్రతి ఒక్కరిని కలిచివేసింది.

# సైరన్ మోగిన వెంటనే ఏం చెయ్యాలంటే?

- హైదరాబాద్ నగరంలోని ఓఆర్ఆర్ పరిధిలో మాక్ డ్రిల్
- ప్రజలకు సూచనలను తెలిపిన సీపీ ఆనంద్.



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ నగరంలోని ఓఆర్ఆర్ పరిధిలో కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు మాక్ డ్రిల్ నిర్వహించబోతున్నారు. ఈ మేరకు సీపీ ఆనంద్ ప్రజలకు డ్రిల్ సమయంలో ఏం జరగబోతుంది? ఆ సమయంలో ఎలా ఉండాలని తాజాగా సూచించారు. ఇందులో భాగంగా అయన మాట్లాడుతూ.. 55 ఏళ్లనాటి వార్ సైరన్ ను వాడుతున్నామని, అలాగే సైరన్ మోగిన సమయంలో ఏమి చెయ్యాలి అనే దానిమీద అవగణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.డ్రిల్ మధ్యాహ్నం 4 గంటలకు నగరమంతా సైరన్లు వినిపిస్తాయని, ప్రతిఒక్కరు ఆ సమయంలో బాధ్యతగా వ్యవహరించాలని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా నగరంలోని పోలీసు, అగ్నిమాపక, పారిశ్రామిక విభాగాలు 2 నిమిషాల్లో నగరంలోని అన్ని సైరన్లు మోగిస్తాయని తెలిపారు. ఇక సైరన్ వినిపించినప్పుడు ప్రజలు వెంటనే భద్రత కలిగిన ప్రదేశానికి వెళ్లాలని, ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల నుంచి దూరంగా వెళ్లాలని ఆయన అన్నారు. సైరన్ మోగిన వెంటనే ఎక్కడి వాళ్ళు అక్కడే ఉండాలని, వాహనం మీద ఉన్న వాళ్ళు పక్కకు అపి పక్కకు వెళ్ళాలని సూచించారు.ఆ తర్వాత మధ్యాహ్నం 4 గంటల 15 నిమిషాలకు రెండో సైరన్ మోగిస్తాము తెలిపారు. ఇది నగరంలోని 4 వేర్వేరు ప్రదేశాల్లో వైమానిక దాడి ప్రభావం గురించి రక్షణ సేవలను అప్రమత్తం చేస్తుంది. ఫైర్, హెల్త్, పోలీస్, రెవినవే, GHMC, SDRF, ట్రాన్స్పోర్ట్ లతో ముందుకు వెళ్తామని సీపీ ఆనంద్ తెలిపారు. ఈ రోజు నుంచి అందరి లీవ్ క్యాన్సల్ చేశామని, ఏ డిపాట్మెంట్ ఏమి చేయాలో సూచించినట్లు ఆయన తెలిపారు. అలాగే ఫేక్ న్యూస్ ప్రచారం మీద దృష్టి పెట్టినట్లు ఆయన చెప్పుకొచ్చారు. ఇంకా మెడికల్ అండ్ హీల్త్ డిపాట్మెంట్ వాళ్ళు హాస్పిటల్ మీద రెడ్ క్రాస్ మార్క్ చేయాలని ఆయన సూచించారు. కేంద్రం ఆదేశాలతో ఆపరేషన్ అభ్యాస్ నిర్వహిస్తున్నామని, ఫేక్ న్యూస్ నమ్మకండని అన్నారు. హెల్త్, GHMC, ట్రాన్స్పర్ట్ అన్నీ టైమ్ లో సిద్దంగా ఉండాలని ఆయన సూచించారు. ముఖ్యంగా NDRF సిద్దంగా ఉండాలని సూచించారు.

# అప్పులు పుట్టడం లేదనడం సీఎంగా ఫెయిల్

**సిద్దిపేట ,ఫ్లాష్ ఇండియా :** సీఎం రేవంత్ రెడ్డి తీరు పై మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. అప్పులు పుట్టడం లేదనడం సీఎం గా ఫెయిల్ అయినట్లే అన్నారు.. పాలన చేత కాక పోతే దిగిపోవాలని సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు హితవు పలికారు. సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడ్ లోని ఐకేపీ సెంటర్ లో వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యం ను ఎమ్మెల్యే హరీష్ రావు పరిశీలించి కలెక్టర్, ఆర్డీవో, సివిల్ సప్లై అధికారులతో ఫోన్ లో మాట్లాడి తడిచిన ధాన్యంను కొనుగోలు చేయాలని కోరారు. అనంతరం హరీష్ రావు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం వడ్ల కొనుగోలు లో పూర్తిగా విఫలం అయిందన్నారు.హైదరాబాద్ లో కూర్చొని అందాల పోటీలపై రివ్యూలు చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. రైతులు అప్పులు తెచ్చి పండించిన అకాల వర్షాలకు బారిన పడి మొలకెత్తుతున్న పట్టించుకున్న పపానా పోలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చిల్లర మాటలు మానుకోవాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో వడ్ల కొనుగోళ్లలో ఆలస్యం కాలేదని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ ప్రయాణాలు.. మంత్రుల గాలి మోటార్ ప్రయాణాలు తప్ప రైతులకు ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. అనంతరం రాంపూర్ గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంను ఎమ్మెల్యే హరీష్ రావు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



# ములుగు జెడ్పీ ఆఫీసులో ఏసీబీ దాడి



**ములుగు,ఫ్లాష్ ఇండియా :** ములుగు జిల్లా కేంద్రంలో అవినీతి అధికారిపై ఏసీబీ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం జెడ్పీ కార్యాలయంలో రైడ్ నిర్వహించిన ఏసీబీ అధికారులు, సూపరిండెంట్ సుధాకర్ ను రూ.25,000 లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అవినీతి లావాదేవీతో సంబంధం ఉందన్న అనుమానంతో జూనియర్ అసిస్టెంట్ సౌమ్యను కూడా అదుపులోకి తీసుకున్నారు. తోటి ఉద్యోగి ద్వారా లంచం తీసుకుంటున్న సమయంలో అధికారులు సుధాకర్ ను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఇద్దరినీ ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు. పూర్తి వివరాలు త్వరలో వెలుగులోకి వచ్చే అవకాశముంది. ఈ దాడితో జిల్లా వర్గాలలో హల్చల్ రేగింది.

# రోడ్డెక్కిన అన్నదాత... ఎర్రటి ఎండలో ఆందోళన



**తల్లాడ,ఫ్లాష్ ఇండియా :** మొన్నటిదాకా పంటను పండించుకునేందుకు ఆగమైన రైతులు ఇప్పుడు ధాన్యం అమ్ముకునేందుకు అరిగోస పడుతున్నారు. ధాన్యం కొనుగోలులో సర్కారు నిర్లక్ష్యం అధికారుల అలసత్వంపై రైతన్న ఆగ్రహిస్తున్నాడు.బుధవారం తల్లాడ మండలం స్థానిక రింగ్ రోడ్ లో రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రైతులు హాజరై మండుటి ఎండను సైతం లెక్క చేయకుండా ధర్నా చేశారు. ప్రభుత్వం తీరును ఎండగడుతూ చిరుధాన్యం తెస్తే రోజులు గడుస్తున్న కాటా పెట్టడం లేదని రైతులను ఇలా ఇబ్బంది పెట్టడం ఇదేం పద్ధతి అంటూ ప్రశ్నించారు.అనంతరం సిపిఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి రైతు సంఘం నాయకుడు సేలం సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ తల్లాడ మండలంలో కుర్నవల్లి గ్రామంలో ఉన్నటువంటి ధాన్యాన్ని గని సంచులు ఇచ్చి ధాన్యాన్ని కాటా వేసి సక్రమంగా లారీల ద్వారా మిల్లులకు తరలించాలని.గత కొద్ది రోజుల నుంచి అధికారులకు స్థానిక ఎమ్మెల్యేకి వినతి పత్రాల ద్వారా అలాగే వ్యక్తిగత ఫోన్ల ద్వారా మా మొర విన్నవించామని కానీ హఠాత్తుగా మంగళవారం రాత్రి కురిసిన వానకి శాతం వచ్చిన ధాన్యం మొత్తం తడిసి ముద్దయింది.ప్రభుత్వం యొక్క బాధ్యతారహితంగా నే యొక్క ధాన్యం అకాల వర్షానికి తడిసిపోయాయని ఆగ్రహంచిన రైతులు వెయ్యి మంది రైతులతో స్థానిక రింగ్ రోడ్ లో ధర్నా నిర్వహించామని.స్థానిక ఎమ్మార్వో ని మాకు గన్ని బ్యాగ్స్ కావాలని అడగగా గత పది రోజుల నుంచి నాలుగు లారీలను 20వేల గన్ని బ్యాగులను పంపిస్తానని చెప్పిన ఎమ్మార్వో ఇప్పటిదాకా ఇలాంటి పరిష్కారం చేయలేదు కాబట్టే వారు మాట మీద మనకు నమ్మకం పోయి ఈ రోజు రైతన్న రోడ్ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారన్నారు.అధికారులు స్పందించి మాకు తగిన న్యాయం చేయవలసిందిగా లేకపోతే రానున్న రోజులో ధర్నా ఉధృతంగా ఉంటుందని హెచ్చరించారు. అనంతరం ఎమ్మార్వో సాయంత్రం లాగా పరిష్కరిస్తానని చెప్పగా ధర్నా విర్మించుకున్నారు.

**తల్లాడ ఎమ్మార్వో సురేష్ కుమార్ వివరణ..**

రైతన్న బాధ మాకు తెలుసు..కానీ రైతులు ధాన్యం నింపటానికి గన్ని బ్యాగ్స్ అడుగుతున్నారు ఒకవేళ గన్ని బ్యాగ్స్ ఇస్తే ట్రక్ సీట్ ఇచ్చి లారీలు కూడా పంపించాల్సి వస్తుంది కాబట్టే లారీ ట్రాన్స్పోర్ట్ వారితో కూడా మాట్లాడుతున్నాను. రైతులు అడిగిన విధంగానే 20వేల గని బ్యాగ్స్,4 లారీలను బుధవారం సాయంత్రం 4గంటలకు పంపిస్తానని. ఈ సమస్యపై ఉన్నత పై అధికారులకు డియం, సీసీ,ఆర్డిఓకి చెప్పానని అలాగే హనుమకొండ వెళ్లిన లారీలు ఈరోజు వస్తాయని రెండు రోజుల్లో పూర్తిగా ధాన్యం కొనుగోలు చేస్తామని ఈ సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అలాగే అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఈరోజు గ్రామానికి వెళ్లి తాసీల్దార్ ఏవో వెళ్లి పరిశీలిస్తామని రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని ఒకవేళ తడిసిన ఒక రోజు మ్యాచర్ వచ్చే విధంగా చూసి వాటిని కొనుగోలు చేపిద్దామని వారన్నారు.రైతన్న మానవత్వం... ధర్నాలో ఇరుక్కుపోయిన కారులో ఉన్న ఎమర్జెన్సీ పేషెంట్ ను పంపించిన రైతన్నలుతల్లాడ మండలం లో ధాన్యం కొనుగోలు చేయట్లేదని ఆరు కాలం పండించిన ధాన్యం చేతికొచ్చిన పంట అకాల వర్షానికి తడిసి ముద్దయి పాడైపోతుందని రైతన్న రైతు సంఘం నాయకులు ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహిస్తే అక్కడ రైతన్న మరోసారి పెట్టే చెయ్యే కాదు రైతన్న భూమి మీద ఉన్న మరొక దేవుడని మానవత్వంతో నిరూపించుకున్నాడు ఒక కారు నుంచి దిగి మహిళ రైతులను కారులో పేషెంట్ ఉన్నాడు అర్జెంటుగా విజయవాడ ఆసుపత్రికి తీసుకెళ్లాలి అని చెప్పగా ఒక్కసారిగా రైతులు లేచి ఆ పేషెంట్ ఉన్న కారును ఎవరు ఆపకుండా పంపించడం మానవత్వం చాటుకుందని చెప్పాలి. రైతు పండించిన పట్టా ప్రతి పూట నాలుగు ఏళ్లు నోట్లో పోతుంటే మరోసారి ఇలాంటి సేవ చేసి రైతు దేశానికి వెన్నెముక అని చాటి చెప్పాడు..

# జువ్వాడి వర్సెస్ సుజిత్ రావు

**జగిత్యాల,ఫ్లాష్ ఇండియా :** జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లా కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం రసాభాస గా మారింది. సమావేశానికి పీసీసీ పరిశీలకుడిగా వచ్చిన విశ్వనాథన్ సాక్షిగా పార్టీ వర్గపోరు బయటపడింది. కోరుట్ల నియోజక వర్గ ఇన్చార్జి జువ్వాడి నరసింగరావు వర్గీయులు కల్వకుంట్ల సుజిత్ రావు వర్గీయుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. మెట్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని బి ఆర్ ఎస్ నుండి కాంగ్రెస్ లోకి వచ్చిన వ్యక్తికి ఎలా ఇస్తారని పార్టీ లో మొదటి నుండి ఉన్న వారికి అన్యాయం చేస్తారా అని జువ్వాడి వర్గీయులు వివాదం చేయగా అదే రీతిలో సుజిత్ రావు వర్గీయులు ఎదురు దాడి చేసారు.మెట్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గోవర్ధన్ స్టేజి మీద కూర్చోవడం తో మొదలైన గొడవ ఒక దశలో కొట్టుకునే స్థితికి వచ్చింది. దీనితో గొడవ పెద్దదికాకముందే ప్రభుత్వ విప్ డి సి సి అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్ జోక్యం చేసుకుని వివాదాన్ని సద్దుమనిగేలా చేశారు.అనంతరం సుజిత్ రావు వర్గీయులు సమావేశాన్ని నుండి వెళ్ళిపోయారు.

**పార్టీలు మారిన నువ్వా మాట్లాడేది : మెట్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గోవర్ధన్ ..**

సమావేశం నుండి బయటకి వచ్చిన మేట్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గోవర్ధన్ మాట్లాడుతూ పార్టీ నీ నమ్ముకుని ఉన్న మాకు న్యాయం చేయడం లేదని పార్టీలు మారిన నువ్వా ప్రశ్నించేది అని మెట్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.పార్టీ టికెట్ ఇవ్వకుంటే ఇండిపెండెంట్ గా పోటీ చేసి ఆ తర్వాత బి ఆర్ ఎస్ పార్టీ కి వెళ్ళిన విషయం నిజం కాదా బీజేపీ వాళ్ళతో కలిసింది నిజం కాదా పార్టీ లు మారిన నీకు ప్రశ్నించే హక్కు లేదని అన్నారు.



# హార్డ్ వర్క్ కాదు.. స్మార్ట్ వర్క్ ముఖ్యం


**గద్వాల,ఫ్లాష్ ఇండియా :** హార్డ్ వర్క్ కాదు.. స్మార్ట్ వర్క్ ముఖ్యమని కలెక్టర్ సంతోష్ విద్యార్థులకు సూచించారు. పదో తరగతి ఎగ్జామ్స్ లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో మంగళవారం కలెక్టరేట్ లో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. రెసిడెన్షియల్ స్కూల్స్ నుంచి పదో తరగతి పరీక్షల్లో 550 మార్కులకు పైగా సాధించిన 34 మంది విద్యార్థులను కలెక్టర్ అభినందించి భవిష్యత్ ప్రణాళిక గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్మాట్లాడుతూ ఇంటర్మీడియట్ దశ విద్యార్థుల దిశను నిర్దేశిస్తుందని తెలిపారు. ప్రతి విషయాన్ని లోతుగా అర్థం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. టెక్నాలజీని అవసరం మేరకు ఉపయోగించుకోవాలని చెప్పారు. చెడు అలవాట్లు ఉన్న స్నేహితులకు దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో అబ్దుల్ గని, హెచ్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హెడ్ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

**కామారెడ్డి ,ఫ్లాష్ ఇండియా :** గత ఏడాది పాస్ పోర్టు విచారణలో తీవ్ర నిర్లక్ష్యం వహించినందుకు హెడ్ కానిస్టేబుల్ పి.కృష్ణను సస్పెండ్ చేస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేశారు. టేకుల రాజయ్య పాస్ పోర్టు దరఖాస్తు పై విచారణ సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు పేర్కొన్నారు. కనీస ప్రాథమిక పరిశీలన లేకుండానే క్లియరెన్స్ ఇచ్చారని తెలిపారు. సమగ్ర విచారణ చేయకపోవడంతో రాజయ్యకు అంతకు ముందే రాజు పేరుపై ఉన్న పాస్ పోర్టు గురించి తెలుసు కోలేకపోయారన్నారు.దీంతో రాజయ్య పై ఆర్జీఐ ఎయిర్ పోర్ట్ పోలీసు స్టేషన్లో కేసు కూడా నమోదు అయిందన్నారు. ఈ విషయం జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర దృష్టికి రాగా పరిశీలించిన అనంతరం ఈ విషయాన్ని ఇంచార్జ్ డిఐజికి నివేదిక పంపించారు. ఈ విషయాన్ని సీరియస్ గా పరిగణించిన ఇంచార్జ్ డి ఐ జి బాధ్యతారాహిత్యానికి బాధ్యుడైన హెడ్ కానిస్టేబుల్ కృష్ణను తక్షణమే సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.



# సిరీస్‌కు కాశ్వీ దూరం



భారత్, శ్రీలంక, దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్న మహిళల ముక్కోణపు వన్డే సిరీస్ నుంచి టీమిండియా ఆల్ రౌండర్ కాశ్వీ గౌతమ్ తప్పుకుంది. ఈ సిరీస్ లోనే కాశ్వీ అంతర్జాతీయ అరంగేంట్రం చేసింది. ఆడిన మూడు మ్యాచుల్లో వికెట్లేమీ తీసుకోకుండా, కేవలం 22 పరుగులే చేసింది. కాలికి గాయం అవడంతో ఆమె ఈ సిరీస్ నుంచి తప్పుకున్నట్లు, ఆమె స్థానంలో మధ్యప్రదేశ్ కు చెందిన క్రాంతి గౌడ్ ను తీసుకుంటున్నట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి.డబ్ల్యూపీఎల్ లో యూపీ వారియర్స్ తరపున ఆడిన క్రాంతి.. 8 మ్యాచుల్లో ఆరు వికెట్లతో రాణించింది. ఇక, ఈ సిరీసులో వరుసగా రెండు మ్యాచులు గెలిచిన భారత మహిళలు.. తమ చివరి మ్యాచులో శ్రీలంక చేతిలో ఓటమి చవిచూశారు. ఇది 2018 తర్వాత శ్రీలంక చేతిలో భారత మహిళలకు తొలి ఓటమి. కాగా, భారత జట్టు బుధవారం నాడు సౌతాఫ్రికాతో తదుపరి మ్యాచ్ ఆడనుంది.

# తెలుగు స్విమ్మర్ల పతకాల పంట




ఖేలో ఇండియా యువజన క్రీడల్లో మంగళవారం తెలుగు స్విమ్మర్లు పతకాల పంట పండించారు. తెలంగాణకు చెందిన వర్షిత్ (బాలుర 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లే), సుహాస్ ప్రీతమ్ (బాలుర 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ ), శ్రీనిత్య సాగి (బాలికల 100 మీ. బ్యాక్ స్ట్రోక్ ) తమ విభాగాల్లో విజేతలుగా నిలిచి రాష్ట్రానికి మూడు స్వర్ణాలు అందించారు. ఇక, ఒక కిలోమీటర్ సైక్లింగ్ ట్రాక్ ఈవెంట్ లో సాయిచరణ్ యాదవ్ కాంస్యం నెగ్గి తెలంగాణ ఖాతాలో నాలుగో పతకాన్ని చేర్చాడు. స్విమ్మింగ్ 1500 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్ లో ఆంధ్రప్రదేశ్ కు చెందిన సంపత్ కుమార్ యాదవ్ , తీర్థు సామదేవ్ వరుసగా స్వర్ణ, కాంస్యాలు దక్కించుకున్నారు. ఇక, 400 మీ. వ్యక్తిగత మెడ్లేలోనూ సత్తా చాటుతూ తీర్థు సామదేవ్ రజతం గెలిచాడు.

# ఐపీఎల్ 2025పై ఎఫెక్ట్!



పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్- పాకిస్తామ్ మధ్య యుద్ధ వాతావరణం కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో భారత్ లో జరుగుతున్న ఇండియన్ ప్రిమియర్ లీగ్ పై తీవ్ర ఉత్కంఠ కొన సాగుతుంది. రెండు దేశాల మధ్య యుద్ధం జరిగితే.. దాని ప్రభావం ఐపీఎల్ పై పడుతుందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో గతంలో కూడా ఇలాంటి పరిణామాలు జరిగినప్పటికీ.. ఎప్పుడు కూడా క్యాష్ రిచ్ లీగ్ పూర్తిగా రద్దు కాలేదు.. మే 25వ తేదీ వరకు జరగనున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 సీజన్ కొనసాగు తుందని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) వర్గాలు వెల్లడించాయి. కాగా, ప్రస్తుత పరిస్థితులు ఐపీఎల్ మ్యాచ్ లపై ఎటువంటి ప్రభావం చూపవని బీసీసీఐ తెలిపింది. షెడ్యూల్ ప్రకారం కొనసాగుతుందన్నారు.అయితే, భారత్ లో 2008లో ప్రారంభమైన ఐపీఎల్ సక్సెస్ ఫుల్ గా కొనసాగుతుంది. 2009లో ఇండియాలో లోక్ సభ ఎన్నికల ఉండటంతో భద్రతా పరమైన సమస్యలు వస్తాయని చెప్పడంతో తొలిసారి దక్షిణా ఫ్రికాలో లీగ్ నిర్వహించారు. ఆ తర్వాత 2014 సీజన్ లో మరోసారి లోక్ సభ ఎన్నికలు ఉన్నందున ఏప్రిల్ 16 నుంచి ఏప్రిల్ 30 వరకు మొదటి దశ షెడ్యూల్ UAEలో జరిగింది.. అనంతరం మే 2 నుంచి తిరిగి భారతదేశానికి వచ్చింది. అలాగే, 2020లో కరోనా మహమ్మారి కారణంగా ఈ టోర్నమెంట్ ను మరోసారి UAEకి మార్చారు.ఇక, 2021లో ఐపీఎల్ టోర్నమెంట్ భారతదేశంలో జరిగింది. కేవలం, ఢిల్లీ, అహ్మదాబాద్, ముంబై, చెన్నై నాలుగు వేదికలలో మాత్రమే కొనసాగింది. 2022లో కూడా ప్రేక్షకులు లేకుండానే ఈవెంట్ కొనసాగింది భారత్ లో.. ముంబై, పూణే, కోల్ కతా, అహ్మదాబాద్ నాలుగు వేదికలలో మాత్రమే జరిగింది. అయితే, కరోనా తగ్గిపోవడంతో 2023 నుంచి ఐపీఎల్ మళ్ళీ భారతదేశం మొత్తం నిర్వహిస్తున్నారు.. ఇప్పుడు పాకిస్తాన్ తో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో భద్రతా పరమైన ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టారు.కాగా, 'ఆపరేషన్ సిందూర్'లో భారత సాయుధ దళాలు సమన్వయంతో పాకిస్తాన్, పీఓకేలోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై దాడి చేశాయి. భారత దళాలు పాకిస్తాన్ లోని బహవల్పూర్, మురిద్కే, సియాల్ కోట్ లోని కీలక ప్రదేశాలతో సహా మరో నాలుగు ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని నాశనం చేశాయి. జైష్-ఎ-మొహమ్మద్, లష్కరే-ఎ-తోయిబా, హిజ్బుల్ ముజాయిదీన్ స్థావరాలపై దాడులు చేసి సుమారు 80 మందికి పైగా టెర్రరిస్టులను హతం చేసింది.

# భారత క్రికెట్ ఎవరి సొత్తూ కాదు



'భారత క్రికెట్ ఎవడబ్బ సొత్తూ కాద'ని టీమిండియా చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్ అన్నాడు. తన కోచింగ్ పై విమర్శలు చేస్తున్న మాజీ ఆటగాళ్లకు ఘాటుగా బదులిచ్చాడు. 'కోచ్ గా బాధ్యతలు చేప ట్టినప్పుడే.. ఒడిదుడుకులు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలుసు. దేశం గర్వపడేలా చేయడమే నా పని. అంతేకానీ ఏసీ గదుల్లో కూర్చొని కామెంట్రీ పేరుతో ఏదో మాట్లాడే వారిని ప్రసన్నం చేసుకోవడం కాదు' అని కౌంటర్ ఇచ్చాడు. కొందరు మాజీలు భారత క్రికెట్ ను సొంత ఆస్తిలా భావిస్తు న్నారన్నాడు. 'కొందరు 25 ఏళ్లుగా కామెంట్రీ బాక్స్ లో తిష్టవేసుకొని కూర్చొన్నారు. భారత క్రికెట్ ఏదో వారి కుటుంబ ఆస్తి అని అనుకొంటున్నారు. కానీ, ఇదంతా భారత ప్రజలది అనే వాస్తవాన్ని గుర్తించాలి' అని గౌతీ అన్నాడు. ఇక, ఇంగ్లండ్ టూర్ కు భారత జట్టు ఎంపికలో తన జోక్యం ఏమీలే దన్నాడు. రోహిత్ , కోహ్లీ మెరుగైన ప్రదర్శన చేస్తున్నంత కాలం జట్టులో కొనసాగే అర్హత ఉంటుందని చెప్పాడు. జట్టు ఎంపికలో తన పాత్ర లేదని.. అంతా సెలెక్టర్లదేనని గంభీర్ తెలిపాడు.

**పాక్ తో ఎక్కడా ఆడొద్దు**

పహల్గాం దాడి నేపథ్యంలో.. సీమాంతర ఉగ్రవాదానికి ముగింపు పలకనంత వరకు పాకిస్థాన్ తో క్రికెట్ సంబంధాలను పూర్తిగా తెంచుకో వాలని గంభీర్ డిమాండ్ చేశాడు. ఆసియాకప్ , ఐసీసీ ఈవెంట్లలో కూడా పాక్ తో ఆడకూడదనేది తన వ్యక్తిగత అభిప్రాయమన్నాడు.

# గెలుపే లక్ష్యంగా



వరుసగా ఎనిమిది వన్డేల్లో జైత్రయాత్ర సాగించిన భారత మహిళల జట్టుకు ఆదివారం శ్రీలంక చేతిలో ఝలక్ తగిలింది. ఆ మ్యాచ్ లో విజయంతో మహిళల ముక్కోణపు వన్డే సిరీస్ ఫైనల్లోనూ చోటు దక్కించుకోవాలనుకుంది. అయితే బుధవారం దక్షిణాఫ్రికాతో జరిగే మ్యాచ్ ద్వారా భారత్ కు మరో అవకాశం. సఫారీలపై అన్ని విభాగాల్లో చెలరేగి హర్మన్ సేన తుది పోరుకు అర్హత సాధించాలనుకుంటోంది. అటు దక్షిణాఫ్రికా కూడా భారత్ పై విజయంతో బోణీ చేయాలనుకుంటోంది.

# గుజరాత్ గట్టెక్కింది



తాజా సీజన్ లో హైలైట్ అనదగ్గ మ్యాచ్ అంటే ఇదేనేమో. గుజరాత్ టైటాన్స్ ముందు కేవలం 156 పరుగుల ఛేదనే అయినా ఎన్ని మలుపులో.. ముంబై ఇండియన్స్ బౌలర్ల విజృంభణతో మ్యాచ్ ఇరువైపులా మొగ్గుచూపింది. దీనికితోడు రెండుసార్లు వరుణుడితో ఇబ్బంది. సవరించిన ఛేదన ప్రకారం ఆఖరి ఓవర్ లో 15 పరుగులు కావాల్సిన వేళ మరింత హైడ్రామా నెలకొంది. అయినా ఎలాగోలా ఆఖరి బంతికి సింగిల్ తో టైటాన్స్ ఊపిరిపీల్చుకుంది. దీంతో మంగళవారం జరిగిన ఈ ఉత్కంఠభరిత మ్యాచ్ లో 3 వికెట్ల తేడాతో డక్ వర్త్ లూయిస్ పద్ధతిన గుజరాత్ నెగ్గింది. అలాగే 16 పాయింట్లతో టాప్ లోకి చేరింది. అటు ముంబై వరుస ఆరు విజయాలకు బ్రేక్ పడింది. ముందుగా బ్యాటింగ్ కు దిగిన ముంబై 20 ఓవర్లలో 8 వికెట్లకు 155 పరుగులు చేసింది. విల్ జాక్స్ (35 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 53), సూర్యకుమార్ (24 బంతుల్లో 5 ఫోర్లతో 35), బాష్ (27) మాత్రమే రెండంకెల స్కోర్లు సాధించారు. సాయికిశోర్ కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనను వర్షం కారణంగా గుజరాత్ లక్ష్యాన్ని 19 ఓవర్లలో 147 పరుగులకు కుదించారు. అయితే, గుజరాత్ సరిగ్గా అన్నే ఓవర్లలో 147 రన్స్ చేసి గెలిచింది. గిల్ (43), బట్లర్ (30), రూథర్ ఫోర్డ్ (28) పోరాడారు. బుమ్రా, బౌల్ట్ , అశ్వనిలకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా గిల్ నిలిచాడు.


**వణికించిన బౌలర్లు:** స్వల్ప ఛేదనలో గుజరాత్ ఇన్నింగ్స్ సజావుగా ఏమీ సాగలేదు. పేసర్లు దీపక్ , బౌల్ట్ , బుమ్రా కట్టుదిట్టమైన బంతులకు పరుగులు రావడమే కష్టమైంది. గిల్ , బట్లర్ , రూథర్ ఫోర్డ్ మినహా మరెవరూ దీటుగా నిలబడలేదు. ఈ సీజన్ లో నిలకడగా రాణిస్తున్న ఓపెనర్ సాయి సుదర్శన్ (5)ను రెండో ఓవర్ లోనే బౌల్ట్ అవుట్ చేశాడు. బంతి బ్యాట్ మీదికి రాకపో వడంతో ఆ తర్వాత గిల్ , బట్లర్ నిదానం కనబర్చారు. దీంతో పవర్ ప్లేలో 29/1 స్కోరు మాత్రమే సాధించింది. అయితే హార్దిక్ తన ఓవర్ లో మూడు వైడ్లు, రెండు నోబ్స్ , 4,6తో 18 పరుగులు సమర్పించుకున్నాడు. 12వ ఓవర్ లో గిల్ సులువైన క్యాచ్ ను తిలక్ వదిలేయగా.. తర్వాతి బంతికే బట్లర్ ను అశ్వని అవుట్ చేశాడు. దీంతో రెండో వికెట్ కు 72 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే ఆచితూచి సాగుతున్న ఇన్నింగ్స్ కు రూథర్ ఫోర్డ్ కదలిక తెచ్చాడు. 13వ ఓవర్ లో అతడి 4,4,6తో 15 రన్స్ వచ్చాయి. 14వ ఓవర్ ముగిశాక వర్షం కారణంగా అర్ధగంట పాటు మ్యాచ్ ఆగింది. కానీ ఆ తర్వాత టైటాన్స్ ఒక్కసారిగా తడబడింది. వరుసగా నాలుగు ఓవర్లలో గిల్ , రూథర్ ఫోర్డ్ , షారుక్ (6), రషీద్ (2)ల వికెట్లను కోల్పోయింది. ఇక 12 బంతుల్లో 24 రన్స్ కావాల్సిన వేళ మరోసారి వర్షంతో బ్రేక్ ఏర్పడింది. అర్ధరాత్రి 12.30కి మ్యాచ్ ఆరంభం కావడంతో లక్ష్యం 19 ఓవర్లలో 147కు మార్చారు. దీంతో గుజరాత్ ఆరు బంతుల్లో 15 పరుగులు చేయాల్సి ఉండగా..తెవాటియా ఫోర్ , కొట్జీ సిక్సర్ బాదాడు. అయితే, ఐదో బంతికి కొట్జీని చాహర్ అవుట్ చేయడంతో ఉత్కంఠ నెలకొంది. కాగా, ఆఖరి బంతికి కావాల్సిన సింగిల్ ను అర్షద్ పూర్తిచే యడంతో గుజరాత్ గట్టెక్కింది.

**బ్యాటింగ్ వైఫల్యంతో..:** టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన ముంబైని టైటాన్స్ బౌలర్లు అద్భుతంగా కట్టడి చేశారు. వీరి ధాటికి ఓపెనింగ్ జోడీతో పాటు మిడిలార్డర్ కూడా వైఫల్యం చెందగా.. విల్ జాక్స్ , సూర్యకుమార్ మాత్రం ఇన్నింగ్స్ ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. చివర్లో బాష్ మెరుపు ఆటతో జట్టు గౌరవప్రదమైన స్కోరందుకుంది. వాస్తవానికి గుజరాత్ ఫీల్డింగ్ లో కాస్త చురుకుగా ఉంటే ముంబై పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. పేసర్ సిరాజ్ తొలి ఓవర్ లోనే ఓపెనర్ రికెల్టన్ (2)ను అవుట్ చేశాడు. అదే ఓవర్ లో వన్ డౌన్ బ్యాటర్ జాక్స్ క్యాచ్ ను సుదర్శన్ వదిలేశాడు. అటు ఫామ్ ప్రదర్శిస్తున్న రోహిత్ (7)ను నాలుగో ఓవర్ లో అర్షద్ పెవిలియన్ చేర్చాడు. ఈ దశలో జాక్స్ -సూర్య జోడీ నిలబడింది. సిరాజ్ ఓవర్ లో జాక్స్ 6,4 బాదగా, సూర్య ఐదో ఓవర్ లో 3 ఫోర్లతో 16 రన్స్ అందించాడు. అదే ఓవర్ లో అతడి క్యాచ్ ను సాయికిశోర్ వదిలేశాడు. ఆ తర్వాతి ఓవర్ లోనే జాక్స్ మరో 3 ఫోర్లు బాదగా, అతడి క్యాచ్ ను కూడా సిరాజ్ అందుకోలేకపోయాడు. దీంతో పవర్ ప్లేలో జట్టు 56/2తో నిలిచింది. 11వ ఓవర్ లో జాక్స్ సిక్సర్ తో 29 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. ఆ వెంటనే షారుక్ క్యాచ్ తో సూర్య వెనుదిరిగాడు. దీంతో మూడో వికెట్ కు 71 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. ఇక్కడినుంచి టైటాన్స్ బౌలర్లు పరుగులను కట్టడి చేయడంతో పాటు వరుస ఓవర్లలో జాక్స్ , కెప్టెన్ హార్దిక్ పాండ్యా (1), తిలక్ వర్మ (7), నమన్ ధిర్ (7)ల వికెట్లను తీసి పైచేయి ప్రదర్శించారు. 123/7 స్కోరుతో ఇబ్బందుల్లో పడిన ముంబై చివర్లో బాష్ జోరుతో కోలుకుంది. ఆఖరి ఓవర్ లో బాష్ రెండు సిక్సర్లు, దీపక్ (8 నాటౌట్ ) ఫోర్ తో 18 రన్స్ రావడంతో ముంబై స్కోరు 150 దాటింది.

**స్కోరుబోర్డు**


**ముంబై:** రికెల్టన్ (సి) సుదర్శన్ (బి) సిరాజ్ 2, రోహిత్ (సి) ప్రసిద్ధ్ (బి) అర్షద్ 7, విల్ జాక్స్ (సి) సుదర్శన్ (బి) రషీద్ 53, సూర్యకుమార్ (సి) షారుక్ (బి) సాయి కిషోర్ 35, తిలక్ (సి) గిల్ (బి) కొట్జీ 7, హార్దిక్ (సి) గిల్ (బి) సాయి కిషోర్ 1, నమన్ (సి) గిల్ (బి) ప్రసిద్ధ్ 7, కార్బిన్ బాష్ (రనౌట్ ) 27, దీపక్ చాహర్ (నాటౌట్ ) 8, కర్ణ్ శర్మ (నాటౌట్ ) 1, ఎక్స్ ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 155/8; వికెట్ల పతనం: 1-2, 2-26, 3-97, 4-103, 5-106, 6-113, 7-123, 8-150; బౌలింగ్ : సిరాజ్ 3-0-29-1, అర్షద్ 3-0-18-1, ప్రసిద్ధ్ 4-0-37-1, సాయి కిషోర్ 4-0-34-2, రషీద్ 4-0-21-1, కొట్జీ 2-0-10-1.

**గుజరాత్ :** సాయి సుదర్శన్ (సి) రికెల్టన్ (బి) బౌల్ట్ 5, గిల్ (బి) బుమ్రా 43, బట్లర్ (సి) రికెల్టన్ (బి) అశ్వని 30, రూథర్ ఫర్డ్ (ఎల్బీ) బౌల్ట్ 28, షారుక్ (బి) బుమ్రా 6, తెవాటియా (నాటౌట్ ) 11, రషీద్ (ఎల్బీ) అశ్వని 2, కొట్జీ (సి) నమన్ (బి) చాహర్ 12, అర్షద్ (నాటౌట్ ) 1, ఎక్స్ ట్రాలు: 9; మొత్తం: 19 ఓవర్లలో 147/7; వికెట్ల పతనం: 1-6, 2-78, 3-113, 4-115, 5-123, 6-126, 7-146; బౌలింగ్ : దీపక్ చాహర్ 3-0-32-1, బౌల్ట్ 4-0-22-2, బుమ్రా 4-0-19-2, హార్దిక్ 1-0-18-0, కర్ణ్ శర్మ 2-0-13-0, అశ్వని కుమార్ 4-0-28-2, విల్ జాక్స్ 1-0-15-0.



# ఒక మధురమైన విజయం

కేజీఎఫ్ 1,2 సినిమాలతో ఓవర్ నైట్ స్టార్ గా మారిపోయిన హీరోయిన్ శ్రీనిధి శెట్టి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అలాగే తన అందం, అభినయంతో మంచి ఫేమ్ తెచ్చుకుంది. తాజాగా నేచురల్ స్టార్ నాని నటించిన హిట్-3 మూవీతో ఈ ముద్దుగుమ్మ మన ముందుకు వచ్చింది. ప్రస్తుతం ఈ సినిమా భారీ విజయంతో పాటు కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. కాగా ఈ బ్యూటీ ప్రజెంట్ టాలీవుడ్ యంగ్ హీరో సిద్దు జొన్నలగడ్డ సరసన 'తెలుసు కదా' మూవీలో నటిస్తోంది.ఇదిలా ఉంటే.. నిత్యం సోషల్ మీడియాలో యాక్టీవ్ గా ఉంటూ ఫ్యాన్స్ కి దగ్గరవుతూ ఉండే శ్రీనిధి తాజాగా ఇన్ స్టాగ్రామ్ లో కొన్ని ఫొటోస్ షేర్ చేసింది. అందులో హిట్-3 మూవీ సూపర్ గా సక్సెస్ అవుతున్నందుకు బ్లాక్ శారీలో అదిరిపోయే ఫొటోస్ ను షేర్ చేసింది. అంతేకాకుండా వాటికి 'గుర్తుంచుకోవడానికి మరియు విశ్రాంతి తీసుకోవడానికి ఒక రాత్రి, ఆ తర్వాత వచ్చినది ఒక మధురమైన విజయం #HIT3' అని రాసుకొచ్చింది. దీంతో ఈ పిక్స్ కాస్తా నెట్టింట వైరల్ గా మారగా.. వాటిని చూసిన నెటిజన్లు గార్జియస్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు.




# రూ.100 కోట్ల క్లబ్‌లో

తమిళంతో పాటు తెలుగు, హిందీ లోనూ స్టార్ హీరో సూర్య కు ఎలాంటి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందో చెప్పక్కర్లేదు. ఆయన సినిమాల కోసం ఎంతో ఎదురు చూస్తూ ఉంటారు. ఈ క్రమంలో 'రెట్రో' చిత్రంతో మే1న ప్రేక్షకులను అలరించేందుకు థియేటర్లలోకి వచ్చారు సూర్య. పూజా హెగ్డే హీరోయిన్ గా నటించింది. శ్రియా శరణ్ స్పెషల్ సాంగ్ తో అదరగొట్టింది. ఈ చిత్రాన్ని స్టోన్ బెంచ్ క్రియేషన్స్, 2డీ ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్లపై సూర్య, జ్యోతిక, కార్తికేయన్ సంతానం, రాజశేఖర్ పాండియన్ లు నిర్మించారు. కానీ ఈ సినిమాకు ఆశించినంతగా ఫలితం దక్కలేదు. తెలుగులో అయితే డిజాస్టర్, డివైడ్ టాక్ వచ్చింది. ఎందుకంటే ఇక్కడంతా కూడా నాని 'హిట్ 3' సందడి కనిపిస్తుంది. కానీ తమిళంలో మాత్రం మిక్ డ్ టాక్ అయితే తెచ్చుకుంది. అలాగే డే వన్ మంచి వసూళ్లు వచ్చాయని ప్రకటించారు.కేవలం తమిళనాడులోనే రూ.17 కోట్లకు పైగా గ్రాస్ వచ్చిందని, ఇక వరల్డ్ వైడ్ గా రెట్రో మూవీకి రూ.45 కోట్లకు పైగా గ్రాస్ వచ్చిందని తెలిపారు. కానీ మళ్లీ రెండో రోజు, మూడో రోజు, నాలుగో రోజు వసూళ్లను ప్రకటించలేదు. ఇక ఇప్పుడు ఏకంగా వంద కోట్ల క్లబ్ లో జాయిన్ అయిందని పోస్టర్ రిలీజ్ చేశారు చిత్రబృందం. గతంలో వచ్చిన 'కంగువ' ఆశించిన విజయం సాధించకపోయినా, రెట్రో మిక్స్ డ్ టాక్ తో కూడా ఈ స్థాయి వసూళ్లు సాధించింది అంటే, అది సూర్య క్రేజ్ కు నిదర్శనమని ఫ్యాన్స్ భావిస్తున్నారు. అంతే కాదు విడుదలైన 7 రోజుల్లోనే వంద కోట్ల క్లబ్ లో చేరడం పట్ల సూర్య అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# భారీగా డిమాండ్

బాలీవుడ్ నుండి తెరకెక్కుతోన్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో 'రామాయణ' ఒకటి. నితేశ్ తివారి దర్శకత్వంలో తెరకెక్కుతున్నా ఈ మూవీలో రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, శాండల్ వుడ్ స్టార్ యష్ రావణుడిగా నటించ నున్నట్లు తెలుస్తుంది. సన్నీ డియోల్, రకుల్ ప్రీత్ సింగ్, లారా దత్తా త దిత రులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారట. అయితే సీత పాత్రలో సాయి పల్లవి ని సెలెక్ట్ చేశారు అని తెలిసి, బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ అందరూ ఫైర్ అయిపోయారు. బాలీవుడ్ అసలు హీరోయిన్స్ ఏ లేరా..? ఎందుకు పోయి మలయాళం హీరోయిన్ సాయి పల్లవిని చూస్ చేసుకున్నారు.. అని మండిపడ్డారు. ఇదిలా ఉంటే తాజాగా సాయి పల్లవికి సంబంధించి ఓ వార్త వైరల్ అవుతుంది.ఏంటీ అంటే సాయి పల్లవి ఈ 'రామాయణ' కోసం ఏకంగా రూ. 13 కోట్లు రెమ్యూనరేషన్ డిమాండ్ చేసిందట, ఇప్పటి వరకు ఏ హీరోయిన్ కూడా ఇంత రేంజ్ మొత్తంలో రెమ్యూనరేషన్ అందుకోలేదు. ఇప్పుడు సోషల్ మీడియాలో ఈ వార్త వైరల్ అవుతుండటంతో.. సాయి పల్లవి పై ఓ రేంజ్ లో నెగిటివ్ గా స్పందిస్తున్నారు. అంతకు మించిన రేంజ్ లో పారితోషికం అందుకుటూందని తెలియడంతో బాలీవుడ్ ఇండస్ట్రీకి సంబంధించిన కొంతమంది జనాలు ఏంటి సాయి పల్లవికి అంత సీన్ ఉందా..? అంటూ ఘాటు ఘాటుగా ఆమెను విమర్శిస్తున్నారు. మరి నిజంగానే సాయి పల్లవి అంత డిమాండ్ చేసిందా తెలియాల్సి ఉంది.







# వారిద్దరే నా ఫేవరెట్

హాట్ బ్యూటీ కేతిక శర్మ మళ్లీ వరుస ఛాన్సులు అందుకుంటోంది. మొన్నటి దాకా పెద్దగా ఛాన్సులు లేక ఇబ్బందులు పడింది. కానీ ఇప్పుడు మళ్లీ ఛాన్సులు అందుకుంటోంది. మొన్ననే రాబిన్ హుడ్ లో అదిదా సర్ ప్రైజ్ అనే ఐటెం సాంగ్ లో రెచ్చిపోయింది. దాని తర్వాత మళ్లీ సింగిల్ మూవీలో నటిస్తోంది. శ్రీ విష్ణు హీరోగా వస్తున్న ఈ మూవీలో కేతిక హీరోయిన్. మూవీ ప్రమోషన్లలో భాగంగా తాజాగా ఆమె అనేక విషయాలను పంచుకుంది. అదిదా సర్ ప్రైజ్ వివాదంపై కూడా స్పందించింది ఈ భామ. ఆ విషయంలో డైరెక్టర్ చెప్పినట్టే చేశానని.. తనకేం తెలియదని చెప్పింది.'నేను ఏది చేసినా డైరెక్టర్లు చెప్పినట్టే వింటాను. వారు చెప్పిందే చేస్తాను. అది ప్రేక్షకులను ఇబ్బంది పెట్టి ఉంటే సారీ. సింగిల్ సినిమాతో గీతా ఆర్ట్స్ బ్యానర్ లో నటించాలనే కల తీరిపోయింది. నటనకు స్కోప్ ఉన్న పాత్ర చేయాలన్నదే నా డ్రీమ్. సాయిపల్లవి, కీర్తి సురేష్ నా ఫేవరెట్ హీరోయిన్లు. వారిద్దరి నటన అంటే నాకు చాలా ఇష్టం. వారిలాగా నటనకు స్కోప్ ఉండే పాత్రల్లో నటించాలని ఎంతగానో ఉంది' అంటూ చెప్పుకొచ్చింది ఈ బ్యూటీ.

# స్పిరిట్ షూటింగ్ ఎప్పుడో క్లారిటీ




బాహుబలి సిరీస్ చిత్రాల కోసం ఫైవ్ ఇయర్స్ కేటాయించిన డార్లింగ్ ప్రభాస్. ఆదిపురుష్ టైంలో ఏడాదికి వన్ ఆర్ టూ మూవీస్ తో ఎంటర్టైన్ చేస్తానని ప్రామిస్ చేశాడు. ఆ ప్రామిస్ ఫుల్ ఫిల్ చేసేందుకు వరుస ప్రాజెక్టులకు కమిటై పట్టాలెక్కించాడు. కానీ సినిమాలను అనుకున్న టైంలో కంప్లీట్ చేయడంలో తడబడుతున్నాడు. లాస్ట్ ఇయర్ కల్కి 2898ఏడీతో బ్లాక్ బస్టర్ అందుకున్న ఈ గ్లోబల్ స్టార్ రాజాసాబ్, ఫౌజీ చిత్రాలను ఎనౌన్స్ మెంట్ చేసినంత ఫాస్టుగా ఫినిష్ చేయలేకపోతున్నాడు. అన్నీ అనుకున్నట్లే జరిగి ఉంటే ఈ పాటికే రాజా సాబ్ థియేటర్లలో సందడి చేస్తూ ఉండేది.కల్కి వచ్చి ఈ జూన్ 27కు ఏడాది దాటిపోతుంది. అంటే ఫ్యాన్స్ డార్లింగ్ ను పలకరించి ఇయర్ కాబోతుంది. అదే డేట్ న వస్తోన్న కన్నప్పతో కాస్త కవర్ చేసినప్పటికీ డై హార్ట్ ఫ్యాన్స్ కు అది సరిపోదు. రాజా సాబ్, ఫౌజీ ఎప్పుడు వస్తాయో క్లారిటీ లేదు. ఇంకా షూటింగ్ కంప్లీట్ కాలేదని టాక్. కల్కి టైంలో కాలి నరాలు దెబ్బ తినడంతో ఇటలీలో చికిత్స తీసుకుంటున్న ప్రభాస్ రెస్ట్ కావాల్సినప్పుడల్లా ఫ్లైట్ ఎక్కేస్తుంటాడు. రీసెంట్లీ కూడా ఫారిన్ వెళ్లిన డార్లింగ్ తిరిగి వచ్చాక రాజాసాబ్, ఫౌజీ షూటింగ్ లో పాలగొంటాడట. ఈ కారణాలతోనే మోస్ట్ యాంటిసిపెటెడ్ ప్రాజెక్ట్ స్పిరిట్ కూడా ఆలస్యం అవుతుందని టాక్. ఈ నేపథ్యంలో రీసెంట్లీ ఓ ఇంటర్వ్యూలో క్లారిటీ ఇచ్చాడు ప్రొడ్యూసర్ భూషణ్ కుమార్. మరో టూ, త్రీమంత్స్ లో స్పిరిట్ పట్టాలెక్కుతుంది, దీని తర్వాతే సందీప్ రెడ్డి వంగాతో యానిమల్ పార్క్ నిర్మిస్తాము' అని వెల్లడించాడు. ఇందులో దీపికా నటించబోతుందని టాక్.

# వార్-2 తెలుగు రైట్స్ కోసం




బ్యాక్ టు బ్యాక్ హిట్స్ తో యంగ్ టైగర్ ఎన్టీఆర్ దూసుకెళ్తున్నాడు. అదే జోష్ లో ఓ వైపు బాలీవుడ్ సినిమా వార్ 2ను అలాగే ప్రశాంత్ నీల్ సినిమా షూట్ లో పాల్గొంటున్నాడు తారక్. వార్ 2లో హృతిక్ రోషన్ తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నాడు ఎన్టీఆర్. స్ట్రయిట్ బాలీవుడ్ సినిమాగా వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే అంచనాలు ఓ రేంజ్ లో ఉన్నాయి. ఈ ఏడాది ఆగస్టు 15న ఈ సినిమా వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది.కాగా ఈ సినిమా తెలుగు రైట్స్ కోసం విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. టాలీవుడ్ కు చెందిన బడా నిర్మాత సితార ఎంటర్టైన్మెంట్స్ అధినేత నాగవంశీ వార్ 2 రైట్స్ కోసం ప్రయత్నిస్తున్నారు. అలాగే నైజాం థియేటర్స్ కింగ్ పిన్ అయిన ఏషియన్ సినిమాస్ నిర్మాత కమ్ డిస్ట్రిబ్యూటర్ అయిన ఏషియన్ సునీల్ కూడా వార్ 2 తెలుగు రైట్స్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారట. అయితే వార్ 2 మేకర్స్ అయిన యష్ రాజ్ ఫిల్మ్స్ ఈ సినిమ తెలుగు రైట్స్ ను అటు ఇటుగా రూ. 150 కోట్లు మేర చెప్తున్నారని సమాచారం. అంత మొత్తం కూడా ఇచ్చేందుకు రెడీగా ఉన్నారట సదరు తెలుగు నిర్మాతలు. మరోవైపు దాదాపుగా సితార ఎంటర్టైన్మెంట్స్ నాగవంశీ చేతికి వార్ 2 రైట్స్ రావొచ్చు అనే టాక్ కూడా వినిపిస్తుంది. ఎన్టీఆర్ గత చిత్రం దేవర ను నాగవంశీ భారీ ఎత్తున రిలీజ్ చేసి సూపర్ కలెక్షన్స్ రాబట్టాడు. ఎన్టీఆర్ సినిమా కోసం రెండు సంస్థలు పోటీ పడుతున్న నేపథ్యంలో ఎవరు ఈ వార్ లో గెలిచి వార్ 2 రైట్స్ కొనుగోలు చేస్తారో చూడాలి.




# షూట్ లో మరో అపశృతి

రిషబ్ శెట్టి దర్శకత్వం 'కాంతార ఛాప్టర్-1' తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. 'హోంబాలే ఫిల్మ్స్' అత్యంత ప్రతిష్టాత్మకంగా భారీ బడ్జెట్ తో ఈ మూవీని నిర్మిస్తోంది. గతంలో రిలీజై సంచలన విజయం సాధించిన 'కాంతార' కు ప్రీక్వెల్ గా దీనిని రూపొందిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ మూవీ ని నిర్మిస్తుండగా ఈ క్రేజీ ప్రీక్వెల్ పై.. ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. కానీ ఈ మూవీ షూటింగ్ సమయంలో చాలా సమస్యలు తలెత్తుతున్నాయి.గతంలో 'కాంతారా' మూవీ టీమ్ చాలా ఇబ్బందులు ఎదుర్కొంది. కొన్ని రోజుల క్రితం కొల్లూరులో జూనియర్ ఆర్టిస్టులతో వెళ్తున్న బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కొందరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఆ తర్వాత గాలి వానకు భారీ ఖర్చుతో నిర్మించిన సెట్ ధ్వంసమైంది. ఇప్పుడు తాజాగా ఇదే షూటింగ్ లో ఒక జూనియర్ ఆర్టిస్ట్ విషాదకరంగా మరణించాడు. ఇది ఎలా జరిగింది అంటే 'కాంతార: చాప్టర్ 1' షూటింగ్ సమయంలో, ఈ మూవీ కోసం పనిచేస్తున్న కేరళకు చెందిన జూనియర్ ఆర్టిస్ట్ కపిల్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయాడు. ఉడిపి జిల్లా బైందూర్ లోని కొల్లూరులో ఈ ఘటన జరిగింది. షూటింగ్ పూర్తయిన తర్వాత, కపిల్ తన బృందంతో కలిసి కొల్లూరులోని సౌపర్ణిక నదిలో ఈతకు వెళ్లారు. నీటి లోతు తెలియకనే వారు నదిలోకి దిగారట. దీంతో అతను నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయింది. ఈ సంఘటన కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. జూనియర్ ఆర్టిస్ట్ మరణంతో చిత్ర బృందం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.

Edited, Printed, Published & Owned by KOMARAJU SRINIVASULU and Printed at Ramu Graphics, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229